ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -02 పేజీలు - 08 వెల - 06/-
సోమవారం 14 ఏప్రిల్ 2025



### బాణసంచా తయారీ కేంద్రంలో

# భారీ పేలుడు

## ఎనిమిది మంది మృతి...

**అనకాపల్లి జిల్లాలో విషాద ఘటన**

**కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం**

**ఏడుగురికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం**

అనకాపల్లి, **ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)** అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలార్పుతోన్నారు. పోలీసులు క్షతగాత్రులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మిగతాది 2లో..

# రాజధాని విస్తరణకు

# మరో 44 వేల ఎకరాలు

## 4 మండలాల్లోని 11 గ్రామాల్లో చేపట్టేందుకు ప్రతిపాదన



**కొందరు రైతుల నుంచి అభిప్రాయ సేకరణతో వెలుగులోకి**

**తాజాగా అమరావతి వైపు పలు సంస్థల చూపు**

**అనేక ప్రాజెక్టుల ఏర్పాటుకు సంసిద్ధత**

**విమానాశ్రయం, రైల్వే లైన్, మెట్రో తదితరాలకు ఇప్పుడున్నభూములు చాలవు.. అందుకే మరిన్ని సమీకరణకు యోచన?**



విజయవాడ **ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)** రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు క్రమంగా ఊపందుకుంటున్నాయి. మూడేళ్లలో నిర్మాణం పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున సంస్థలు ఇటు వైపు చూస్తున్నాయి. అమరావతిలో తలపెట్టే ప్రాజెక్టుల సంఖ్య కూడా గణ నీయంగా పెరిగింది. రాజధాని పనులను దశల వారీగా ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు 2014-19 నడుమ సంకల్పిస్తే.. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం మూడు ముక్కలాటతో విధ్వంసానికి పాల్పడిన సంగతి తెలిసిందే. మిగతాది 2లో..



2లో

# ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీలు

**ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల బదిలీ**

**సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ**

**ఆర్పీ సిసోడియా చేనేత, జౌళి శాఖకు బదిలీ**

**జయలక్ష్మికి రెవెన్యూశాఖ అదనపు బాధ్యతలు**

**పలు శాఖలకు కొత్త డైరెక్టర్ల నియామకం**

### భూములకు భద్రత కల్పించడమే

# భూ భారతి ధ్యేయం

## నేడు ప్రయోగాత్మకంగా మూడు మండలాల్లోఅమలు

- జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగాఅందుబాటులోకి
- ఒకేసారి పోర్టల్‌నుసందర్శించవద్దు..
- ఆగిపోయే ప్రమాదంఉంది
- నేడు అంబేద్కర్ జయంతిసందర్భంగా
- పోర్టల్‌ను సిఎం జాతికిఅంకితం చేస్తారు
- ధరణి పేరిటకొల్లగొట్టిన భూములపై ఫోరెన్సిక్ఆడిట్
- వచ్చే నెల మొదటివారంలోగ్రామ పరిపాలనా అధికారుల వ్యవస్థ
- మీడియాతో రెవెన్యూ మంత్రిపొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇష్టాగోష్ఠి

తెలంగాణ భూభారతి



హైదరాబాద్: **ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రంలో అందరి భూములకు భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని, భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నామని రెవెన్యూ, హౌ సింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూ భారతి పోర్టల్‌ను రాష్ట్రమంతటా ఒకేసారి ప్రారంభిస్తే తప్పులు సరిచేయడం ఇబ్బంది అవుతుందని, అందుకే తొలుత ప్రయోగాత్మకంగా మూడు జిల్లాలలోని మూడు మండలాలలో ఈ చట్టాన్ని అమలు చేయబోతున్నామని తెలిపా రు. మిగతాది 2లో..

## కష్టకాలంలో సహకరించిన ప్రధాని మోదీకికృతజ్ఞతలు



- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఇటీవల పవన్ తనయుడికి సింగపూర్ లో ప్రమాదం
- స్కూల్ తరపున సమ్మర్ క్యాంపుకు వెళ్లగా అగ్నిప్రమాదంలో గాయాలు
- చొరవ తీసుకుని పరిస్థితిని సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం
- సోషల్ మీడియా ద్వారా స్పందించిన పవన్ కల్యాణ్

సింగపూర్‌లో తన కుమారుడు మార్క్ శంకర్ సమ్మర్ క్యాంప్‌లో అగ్ని ప్రమాదం బారినపడగా, తక్షణమే స్పందించి సహాయం అందించారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, పీఎంవోకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. సింగపూర్ అధికారులు, సింగపూర్ లోని భారత హైకమిషన్ కార్యాలయం సమన్వయంతో అందించిన మిగతాది 2లో..

# సర్కారు సన్న బియ్యం ఎఫెక్ట్..

## దిగొస్తున్న సన్న బియ్యం రేట్లు..

**తగ్గుముఖం పడుతున్న ధరలు..**

**క్వింటాల్కు రూ.400 నుంచి రూ.600 వరకు తగ్గిన రేట్లు...**

**ఇప్పటికే జిల్లాల్లో 98 శాతం సన్నబియ్యం పంపిణీ...**


3లో



# వైసీపీ నేతల దౌర్జన్యాలకు గురయ్యాం

## చంద్రబాబును కలిసిన పల్నాడు ఎస్సీ కుటుంబాలు...

### అండగా ఉంటామని సీఎం భరోసా

పల్నాడు **ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)**
మాచర్ల నియోజకవర్గం, ఆత్మకూరు గ్రామానికి చెందిన ఎస్సీ కుటుంబాల వారు సీఎం చంద్రబాబును కలిశారు. ఉండవల్లి నివాసంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో ఆదివారం సీఎంను కలిసి గత ప్రభుత్వ హయాంలో తాముపడ్డ కష్టాలను వివరించారు. 2019-24 మధ్య గ్రామంలోని 127 ఎస్సీ కుటుంబాలు వైసీపీ నేతల దాడులు, దౌర్జన్యాలకు గురయ్యాయని సీఎంకు వివరించారు. మిగతాది 2లో..

# అగ్రరాజ్యాల సరసన భారత్

## ఓర్వకల్లు డీఆర్డీవో కేంద్రంలో అత్యాధునిక లేజర్ ఆయుధ పరీక్ష...

కర్నూలు **ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)**
ఏపీలోని కర్నూలు జిల్లా ఓర్వకల్లులో భారత రక్షణ రంగ పాటవాన్ని ఇనుమడింపజేసే అత్యాధునిక లేజర్ ఆయుధ పరీక్ష జరిగింది. ఇక్కడి డీఆర్డీవో కేంద్రంలో నేడు కీలక ఆయుధ పరీక్షలు చేపట్టారు. 30 కిలోవాట్ల లేజర్ ఆధారిత ఆయుధ వ్యవస్థను ఉపయోగించి డ్రోన్ లను కూల్చివేసే పరీక్షలు నిర్వహించారు. ఫిక్స్ డ్ వింగ్ ఎయిర్ క్రాఫ్ట్ లు, మిస్సైళ్లు, డ్రోన్లను ఈ లేజర్ ఆయుధంతో కూల్చివేయడం ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశం. లేజర్ కిరణం తాకగానే, లక్ష్యంగా ఉన్న వస్తువు కాలి బూడిదైంది. ఈ పరీక్ష సక్సెస్ కావడంతో భారత్... అమెరికా, చైనా, రష్యా



దేశాల సరసన చేరింది. ఈ పరీక్ష విజయవంతం కావడంతో భారత రక్షణ వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. ఈ పరీక్ష తాలూకు వీడియోను డీఆర్డీవో తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంది.

# రాజధాని విస్తరణకు మరో 44 వేల ఎకరాలు

**(మొదటి పేజీ తరువాయి)**

ఈసారి అందుకు ఆస్కారం లేకుండా మూడేళ్లలో అమరావతి రాజధానికి నిర్దిష్ట రూపం తీసుకురావాలని చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. 92 ప్రాజెక్టులకు గుర్తించి.. రూ.65 వేల కోట్ల అంచనా వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఇంకా కొన్ని కీలక ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలన్న ఆలోచన కూడా చేస్తున్నారు. ఇందుకు దాదాపుగా 5 వేల నుంచి 7 వేల ఎకరాలు అవసరం. అమరావతి రైల్వేలైన్, అంతర్జాతీయ స్టేడియం, మెట్రో రైలు.. ఇలా చెప్పుకొంటూ పోతే చాలా ప్రాజెక్టులకు భూములు కావాలి. ఇవి కాకుండా నవ నగరాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యతా ఉంది. నవ నగరాలకు భూములు సిద్ధంగా ఉన్నప్పటికీ.. అమరావతికి వస్తున్న అనేక సంస్థలకు భూకేటాయింపులు చేయాల్సి వస్తోంది. ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం పెద్ద ఎత్తున భూములను తీసుకోవలసి ఉంది. పారిశ్రామిక సంస్థలు, ఆతిథ్య రంగ సంస్థలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు.. ఇలా ప్రతి ఒక్కటీ ముందుకు వచ్చి అమరావతిలో భాగస్వామ్యం కావాలనుకుంటున్నాయి.

%వీటికి కూడా భూములను కల్పించాల్సి వస్తోంది. అమరావతిని బెంగళూరు తరహాలో ఇండియా టాప్-10 రియాలిటీ సంస్థల భాగస్వామ్యంతో ప్రజల నివాసానికి సంబంధించిన రెసిడెన్షియల్, గ్రూప్ హౌస్‌లు, హైరైజ్ భవనాలు, కమర్షియల్ భవనాలు తదితరాలను అభివృద్ధి చేయాలన్న ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తోంది. ఇటీవలే బెంగళూరులోని టాప్-5 రియాలిటీ సంస్థలతో సంప్రదింపులు జరిపింది. భూములు కేటాయిస్తే తప్ప ఇవి ముందుకు రావు. రియాలిటీ సంస్థలకు 60:40 వాటా ప్రాతిపదికన భూములిస్తే సీఆర్‌డీఏకు రాయల్టీ కూడా వస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. అమరావతి రాజమార్గాలుగా ఈ-13, ఈ-15 రోడ్లను జాతీయ రహదారి-16కు అనుసంధానిస్తున్నారు. గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాల ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్), అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) లకు అనుసంధానంగా అమరావతి రోడ్లను అనుసంధానించాలి. అంతర్గతంగా మౌలిక సదుపాయాల కల్పన పనులు కూడా పెరిగాయి. ఈ పనులన్నిటికీ భూములను సేకరించడం రానున్న రోజుల్లో కత్తిమీద సామే.

అమరావతిలో రూ.కోట్లు పలుకుతున్న భూములను భూ సేకరణ ద్వారా తీసుకోవడం చాలా కష్టం. ఉభయతారకంగా ఉండాలంటే ల్యాండ్ పూలింగ్ అంటే.. భూ సమీకరణ ఒక్కటే సీఆర్‌డీఏకు మార్గంగా కనిపిస్తోంది. అమరావతిలో వరదనీటి కాలువల విస్తరణ పనుల వల్ల కూడా ప్రస్తుతం సమీకరించిన భూముల విస్తీర్ణం తగ్గుతోంది. కొండవీడువాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ వంటి వాటి పొడవు, వెడల్పులు అదనంగా మూడు రెట్లు పెరుగుతున్నాయి. ఇవి కాకుండా రిజర్వాయర్ల కోసం కొంత కోల్పోవలసి వస్తోంది. మరో కీలక విషయం ఏమిటంటే.. ప్రపంచ బ్యాంకు కూడా మరిన్ని భూములు సమీకరించాలని సూచించినట్లు సమాచారం. రాజధానికి రుణాలు సమకూరుస్తున్న ఈ సంస్థ కొన్ని ప్రయోజనకర ఫలితాలను ఆశిస్తోంది. ఇక్కడ చేపడుతున్న పనుల కారణంగా ఆర్థికంగా మెరుగుపడాల్సి ఉంటుంది. అమరావతి అభివృద్ధికి దోహదపడే ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలి. స్థానికంగా ఉద్యోగాల కల్పన దిశగా మరిన్ని ప్రాజెక్టులను అమరావతి నిర్మాణ పనులతోనే సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలి. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన మేరకు పలు నూతన ఆర్థిక ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుంది. వీటన్నిటికీ అమరావతిలో ప్రస్తుతం సరిపడా భూమి అందుబాటులో లేదు. అలాగని భూసేకరణకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. జగన్ ఐదేళ్ల విధ్వంసంతో తలెత్తిన ఆర్థిక ఇక్కట్లతో ప్రభుత్వం సతమతమవుతోంది. ఈ కారణంగానే రాజధాని విస్తరణకు మరో 44 వేల ఎకరాలను భూసమీకరణ ద్వారా తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఎక్కడెక్కడ భూములు సమీకరించాలో కొన్ని ప్రాంతాలను ప్రతిపాదిస్తూ సీఆర్‌డీఏ ఓ ముసాయిదాను రూపొందించినట్లు తెలిసింది.




**భూ సమీకరణ ప్రతిపాదిత ప్రాంతాలు..**

తుళ్లూరు, అమరావతి, తాడికొండ, మంగళగిరి మండలాల పరిధిలోని మొత్తం 11 గ్రామాల్లో 18,080 హెక్టార్ల (సుమారు 44,670 ఎకరాలు) భూములను తీసుకోవాలనేది ఆలోచన. తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురంలో మొత్తం గ్రామంలోని 2,429.05 ఎకరాలు, వడ్డమానులోనూ పూర్తిగా 1,937.31 ఎకరాలు, పెదపరిమిలో పాక్షికంగా 6,513.69 ఎకరాలు సమీకరించాలని సీఆర్‌డీఏ ప్రతిపాదించింది. అమరావతి మండలం వైకుంఠపురంలో 3,360.63 ఎకరాలు, ఎండ్రాయిలో 2,167.11 ఎకరాలు, కర్లపూడిలో 2,947.06 ఎకరాలు, మోతడక గ్రామంలో 2,345.03 ఎకరాలు, నిడుముక్కలలో 2,013.91 ఎకరాలు.. తాడికొండ మండలం తాడికొండలో 12,797.59 ఎకరాలు, కంతేరులో 3,671.98 ఎకరాలు, మంగ ళగిరి మండలం కాజ గ్రామంలో 4,492.37 ఎకరాలు పాక్షికంగా సమీకరించాలని సీఆర్‌డీఏ అనుకుంటోంది. దీనిపై ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ.. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అంగీకరించాయి. అయితే వీటికి అవసరమయ్యే భూముల కోసం భూ సమీకరణకు వెళ్లాలా.. భూసేకరణ జరపాలా అన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశాయి. భోగాపురం విమానాశ్రయం మాదిరిగా అమరావతిలో కూడా భూ సేకరణ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపాయి.

రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా చేస్తామని ప్రకటించిన తర్వాత భూ సమీకరణ విధానాన్ని ప్రకటించే ముందు 57 వేల ఎకరాలు సమీకరించాలని భావించారు. అప్పట్లో వైకుంఠపురం ప్రాంతానికి చెందిన రైతులు తమ భూములిచ్చేందుకు ముందుకొచ్చారు. లంక భూములు, నదీ తీర ప్రాంత భూములను కూడా తీసుకోవాలన్న డిమాండ్ రైతుల నుంచి వచ్చినప్పటికీ 34 వేల ఎకరాలకే ఆనాడు ప్రభుత్వం పరిమితమైంది. తీసుకున్న వాటిలో వాస్తవంగా మరో 3 వేల ఎకరాలు పలు కారణాల వల్ల ఇంకా సీఆర్‌డీఏ చేతికి రాలేదు. ఈ దశలో అమరావతి పునర్నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ గ్యారెంటీతో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), కేంద్రప్రభుత్వ సంస్థ హడ్కో వంటి రుణ సంస్థలు రుణాలు సమకూర్చుతున్నాయి. ఇతర ప్రైవేటు ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి కూడా నిధులు తీసుకోవడానికి సీఆర్‌డీఏ సిద్ధమవుతూనే.. రాజధాని విస్తరణ ఆలోచన చేస్తుండడం గమనార్హం.

## బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ ప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సందర్శించారు. క్షతగాత్రుల కుటుంబాలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అలాగే సహాయక చర్యలను ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆ క్రమంలో పీహెచ్‌సీలో చికిత్స పొందుతోన్న క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

మరోవైపు ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోం మంత్రి అనితతోపాటు జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఆయన ఫోన్లో మాట్లాడి ఈ ఘటనపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని వారిని ఆదేశించారు. ఈ ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని సీఎం చంద్రబాబుకు హోం మంత్రి అనిత వివరించారు. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పారు.ఇంకోవైపు.. విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఈ ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందడంతో హోం మంత్రి అనిత.. హుటాహుటన ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు సహాయక చర్యలను పర్యవేక్షించారు. అలాగే అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సైతం ఈ దుర్ఘటనపై స్పందించారు. **సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, హోంమంత్రి అనితతో సీఎం ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

## ఏపీలో పలువురుఐఏఎస్‌ల బదిలీలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు.ప్రస్తుతం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆర్పీ సిసోడియాను చేనేత, జౌళి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయలక్ష్మికి రెవెన్యూశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేనికి ఏపీ హెచ్‌ఆర్‌డీఐ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా ముత్యాలరాజును నియమించారు. రైతు బజార్ల సీఈవోగా కె.మాధవీలతను, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శిగా గౌతమిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయుష్ డైరెక్టర్‌గా దినేష్ కుమార్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నీలకంఠారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## వైసీపీ నేతల దౌర్జన్యాలకు గురయ్యాం

**(మొదటి పేజీ తరువాయి)**గ్రామాల్లో ఉండనివ్వకుండా నాటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రోత్సాహంతో వైసీపీ నేతలు తమను వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కాపాడుకోవడానికి ఐదేళ్ల పాటు గ్రామాలు వదిలివెళ్లి తలదాచుకున్నామన్నారు. తాము ఊరిలో లేకపోవడంతో ఇళ్లు కూడా ధ్వంసం చేశారని వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...పార్టీ కోసం పోరాడిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దాడికి ప్రతిదాడి చేయడం టీడీపీ సంస్కృతి కాదని, వైసీపీ బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. వైసీపీ నేతలు ధ్వంసం చేసిన ఇళ్లకు మరమ్మతులు చేయిస్తామని, ఇల్లు లేనివారికి స్థలం కేటాయించి ఇంటిని నిర్మించి ఇస్తామని చెప్పారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అయ్యే మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు. పాడి, పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు చేసి శాశ్వత జీవనోపాధి కల్పిస్తామని అన్నారు. చదువుకున్న యువకులకు శిక్షణ ద్వారా నైపుణ్యాలు పెంచి ఉద్యోగావకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆత్మకూరు గ్రామంలోని ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆత్మకూరు గ్రామంలో తప్పకుండా పర్యటిస్తానని సీఎం అన్నారు. అనంతరం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుని అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసినందుకు ఎస్సీ కుటుంబాలు సీఎంకు ధన్యవాదాలు తెలిపాయి.

## కష్టకాలంలో సహకరించిన ప్రధాని మోదీకికృతజ్ఞతలు

**(మొదటి పేజీ తరువాయి)**

సహాయం కష్ట సమయంలో ఎంతో భరోసానిచ్చిందని పేర్కొన్నారు.ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతంలో 'అడవి తల్లి బాట' కార్యక్రమంలో పాల్గొని, ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన అభివృద్ధి పథకాలను ప్రారంభిస్తుండగా ఈ బాధాకరమైన వార్త తనకు అందిందని పవన్ కల్యాణ్ తెలిపారు. తన కుమారుడికి, ప్రమాదంలో చిక్కుకున్న ఇతర పిల్లలకు సకాలంలో సహాయం అందించడం ద్వారా తన కుటుంబానికి ఎంతో ధైర్యం, ఉపశమనం లభించిందని అన్నారు.

"ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాల జీవితాలను మెరుగుపరచడానికి మీకున్న దార్శనిక నిబద్ధతకు అడవి తల్లి బాట నిదర్శనం. ఈ వర్గాల అవసరాలను పరిష్కరించడానికి మీరు తీసుకున్న అనేక చర్యలలో ఇది ఒకటి. వారి జీవితాలను మార్చేందుకు మీరు చేస్తున్న విస్తృత ప్రయత్నాలలో ఇది కీలకమైన భాగం. పీఎం జన్ మన్, పీఎం జీఎస్‌వై, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సహాయంతో, ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 1,069 కిలోమీటర్ల మేర రోడ్లను రూ.1,005 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఇది 601 బలహీన గిరిజన సమూహాల ఆవాసాల్లో కనెక్టివిటీ సమస్యలను పరిష్కరిస్తుంది. ఈ ప్రాజెక్ట్ గిరిజన ప్రాంతాల్లో రవాణాను మెరుగుపరుస్తుంది, పర్యాటకానికి మద్దతు ఇస్తుంది, సకాలంలో వైద్య సహాయం అందిస్తుంది, ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజలు ఎప్పటినుంచో ఎదుర్కొంటున్న 'డోలీ' కష్టాలకు ముగింపు పలుకుతుంది" అని ప్రధాని మోదీని కొనియాడారు. ఈ క్లిష్ట సమయంలో తన కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చినందుకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

**తిరుమల చేరుకుని డిక్లరేషన్ పై సంతకం చేసిన అనా కొణిదెల... స్వామివారికి తలనీలాల సమర్పణ**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అర్ధాంగి అనా కొణిదెల తిరుమల చేరుకున్నారు. ఇక్కడి గాయత్రి సదనంలో టీటీడీ అధికారుల సమక్షంలో డిక్లరేషన్



పత్రాలపై సంతకం చేశారు. తిరుమల విచ్చేసిన అనా కొణిదెలకు జనసేన నేతలు, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. ఆమె ఈ రాత్రికి తిరుమలలో బస చేయనున్నారు. రేపు ఉదయం సుప్రభాత సేవలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు.

తనయుడు మార్క్ శంకర్ సింగపూర్ అగ్నిప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడిన నేపథ్యంలో ఆమె మొక్కులు తీర్చుకునేందుకు తిరుమల వచ్చారు.

## భూములకు భద్రత కల్పించడమే భూ భారతి ధ్యేయం

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ మూడు మండలాలలో వచ్చిన సమస్యలను పరిష్కరించి, ఆ ఫలితాలను దృష్టిలో పెట్టుకొని జూన్ 2వ తేదీ నాటికి భూ భారతిని పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకువస్తామని చెప్పారు. భూ భారతి పోర్టల్‌ను సోమవారం(ఏప్రిల్ 14) ప్రారంభించనున్న నేపథ్యంలో సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో ఆదివారం రెవి న్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఈ భూభారతి చట్టాన్ని,పోర్టల్‌ను ప్రజలకు అంకితం చేస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో రైతుల భూముల పరిరక్షణ బాధ్యత ఈ ప్రభుత్వానిదే అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని తాము ఇచ్చిన హామీని విశ్వసించి ప్రజలు తమకు అధికారం కట్టబెట్టారని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ధరణిని బంగాళాఖాతంలో వేసి అందరికీ ఆమోదయోగ్యమైన భూ భారతి చట్టాన్ని తీసుకురావడం, అందులో రెవెన్యూశాఖ మంత్రిగా తనకు భాగస్వామ్యం అయ్యే అవకాశం వచ్చినందుకు తన జన్మ ధన్యమైందని వ్యాఖ్యానించారు.

**ధరణి ముసుగులో జరిగిన భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్**

భూ భారతి చట్టం 2029 శాసనసభ ఎన్నికలకు తమకు రిఫరెండం అని గతంలో శాసనసభలోనే ప్రకటించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు కూడా మరోసారి అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నానని తెలిపారు. భూములపై రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి ఒక భరోసా, భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ చట్టం రూపొందించామని తెలిపారు. గతంలో మాదిరిగా రాత్రికి రాత్రే ఇద్దరు వ్యక్తులు కలిసి చట్టాన్ని రూపొందిస్తే తమ ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా రైతులు, మేధావులు నిపుణులతో చర్చించి చట్టాన్ని రూపొందించామని చెప్పారు. గతంలో చెప్పినట్లుగానే భూ భారతి చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ధరణి ముసుగులో జరిగిన భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని పేర్కొన్నారు.

**ఒకే సారి పోర్టల్‌లో ప్రవేశించవద్దు**

రాష్ట్రంలో సోమవారం భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో భూ యజమానులు తమ భూమి వివరాలు తెలుసుకునేందుకు ఒకేసారి పోర్టల్‌ను సందర్శించవద్దని మంత్రి పొంగులేటి విజ్ఞప్తి చేశారు. దీనివలన మొత్తం పోర్టల్ ఆగిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి ఒకేసారి కాకుండా మరుసటి రోజు, ఆ తర్వాత ఎప్పుడైనా భూ యజమానులు పోర్టల్‌లో తమ భూముల వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. అంతేగాక కొంతమంది ఉద్దేశ పూర్వకంగా పోర్టల్‌ను స్టక్ చేయాలని భావిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్ఐసి ఆధ్వర్యంలో నిర్వహించే భూ భారతి పోర్టల్‌లో ఆధునిక అంశాలను జోడిస్తూ అత్యాధునిక వెర్షన్‌ను ప్రజలకు అందించే ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. రిజిస్ట్రేషన్లకు ఆటంకం లేకుండా పోర్టల్ అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వచ్చేనెల మొదటివారంలో గ్రామ రెవెన్యూ పాలనా అధికారులను అమలులోకి తెస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. గతంలో ధరణిని తీసుకువచ్చిన సమయంలో దాదాపు 4 నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా క్రమక్రమంగా పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా భూభారతి చట్టం, పోర్టల్ అమలుకు సంబంధించి ఎంపిక చేసిన ప్రయోగాత్మక మండలాలు, గ్రామాలలో స్వయంగా తాను పర్యటిస్తానని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అదేవిధంగా సంబంధిత మంత్రులు కూడా పర్యటిస్తారని తెలిపారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. భూభారతిలో ఎంఆర్ఓ స్థాయి నుంచి సిసిఎల్ఏ వరకు సుమారు ఐదు స్థాయిలలో భూ సమస్యల పరిష్కారానికి వీలుగా అధికారాలు వికేంద్రీకరించామని వివరించారు. అంతేగాక ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా జిల్లాల వారీగా, లేదా కొన్ని జిల్లాలకు ఒకటి చొప్పున ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రిపబ్లిక్



# సర్కారు సన్న బియ్యం ఎఫెక్ట్..

# దిగొస్తున్న సన్న బియ్యం రేట్లు..

**తగ్గుముఖం పడుతున్న ధరలు..**

**క్వింటాల్కు రూ.400 నుంచి రూ.600 వరకు తగ్గిన రేట్లు...**

**ఇప్పటికే జిల్లాల్లో 98 శాతం సన్నబియ్యం పంపిణీ...**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12. (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తిసుకున్న తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో మార్కెట్లో బియ్యం ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గత నెల వరకు ఫైన్ క్వాలిటీ రైస్ ధరలు క్వింటాల్ రూ.6,500 నుంచి రూ.5,800 వరకు పలికాయి. ఇప్పుడు క్వింటాల్ కు రూ.5 వేల లోపే ధర పలుకుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్న రకం వరి సాగును ప్రోత్సహించింది. సన్న వడ్లకు క్వింటాలు కు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో అటు ప్రభుత్వం, ఇటు మిల్లర్లు పోటీపడి సన్న వడ్లు కొనుగోలు చేశారు. సప్లై పెరగడంతో వ్యాపారులు సన్న బియ్యం ధరలు తగ్గించారు.గత బీఆర్ఎస్ పాలనలో తెల్ల రేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో వాటిని తినలేక పేదలు మార్కెట్ లో అమ్ముకొని సన్న బియ్యం కొనుగోలు చేసేవారు. దీంతో సన్న బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. గత ఉగాది పర్వదినం నాడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. మరోవైపు పంపిణీ చేసిన సన్న బియ్యం సైతం నాణ్యత ఉండడంతో ఎన్నడూలేని విధంగా లబ్ధిదారులు సన్న బియ్యం తీసుకునేందుకు రేషన్ షాపులకు ఎగబడ్డారు. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాల్లో దాదాపు 98 శాతం వరకు 413 రేషన్ షాప్ ల ద్వారా పంపిణీ పూర్తయింది.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 29,28,549 మంది లబ్ధిదారులు రేషన్ కార్డు ఉన్న ఒక్కో లబ్ధిదారుడికి ప్రభుత్వం ఆరు కేజీల చొప్పున సన్న బియ్యం సరఫరా చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 29,28,549 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రతినెలా 17,869 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయనుంది. గతంలో దొడ్డు రకం బియ్యం పంపిణీ చేయడంతో వాటిని లబ్ధిదారులు రేషన్ డీలర్లకే అమ్ముకోవడంతో పెద్ద ఎత్తున రీ సైకిలింగ్ జరిగేవి. ప్రస్తుతం సన్న బియ్యం లబ్ధిదారులే వినియోగిస్తుండడంతో మార్కెట్ లో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.ప్రస్తుతం సన్న బియ్యానికి డిమాండ్ తగ్గడంతో క్వింటాల్ కొత్త బియ్యాన్ని రూ.5 వేల నుంచి రూ.6 వేల దాకా అమ్మారు. బీపీటీ సోనా రూ.5,400, ఆర్ఎన్ఆర్ రూ.5,400, హెచ్ఎంటీ రూ.5,600, జైశ్రీరాం రూ.5,500 దాకా విక్రయించారు. పాత బియ్యాన్ని రూ.5,800 నుంచి రూ.6,500 దాకా అమ్ముకున్నారు. గత నెలతో పోలిస్తే ప్రస్తుతం మార్కెట్లో కొత్త బియ్యం రకాన్ని బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నాయి. ఈ నెలలో క్వింటాల్కు రూ.400 నుంచి రూ.600 వరకు ధరలు తగ్గుముఖం పట్టాయి. మధ్య తరగతి కుటుంబాలు ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షం వ్యక్తం చేస్తున్నారు

## బీటీ.నాయుడుకి బ్రహ్మరథం పట్టిన కర్నూలు ప్రజలు



**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
రెండవసారి ఎమ్మెల్సీగా ఎన్నికైనందున ఉమ్మడి కర్నూలు జిల్లా తరుపున ఆత్మీయ సన్మానం ,కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ హాల్ నందు రెండోవసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన బీటీ.నాయుడు కి ఉమ్మడి కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ తరపున ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చెయ్యడం జరిగింది,ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొని బీటీ.నాయుడు కి బ్రహ్మరథం కట్టారు,ఈ సందర్భంగా బీటీ.నాయుడు మాట్లాడుతూ రెండవసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులునారా చంద్రబాబునాయుడు కి,యువ నాయకులు మంత్రివర్యులు నారా లోకేష్ బాబు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ,తనపై అభిమానంతో కార్యక్రమానికి విచ్చేసిన సోదర సోదరీమణులకు,పార్టీ శ్రేణులకు శిరసాభివందనం చేస్తూ,ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు తనపై చూపించిన వెలకట్టలేని ప్రేమాభిమానానికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ఇండస్ట్రీస్ అండ్? ఫుడ్ ప్రాసెసింగ్ మినిస్టర్ టీజీ.భరత్ గ,కర్నూలు జిల్లా అధ్యక్షులు పి.తిక్కా రెడ్డి ,నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ ,ఎంపీ బస్తిపాటి నాగరాజు ,మాజీ మంత్రివర్యులు కేఈ.ప్రభాకర్ ,ఎమ్మెల్యేలు కెయి.శ్యాం బాబు ,పార్ధసారథి వాల్మీకి ,కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ,వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ ,కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప ,గౌరు వెంకటరెడ్డి , ఇన్చార్జిలు మీనాక్షి నాయుడు ,రాఘవేందర్ రెడ్డి ,వీరభద్ర గౌడ్ ,ఆకేపోగు ప్రభాకర్ ,వైకుంఠం జ్యోతి , కెవి.సుబ్బా రెడ్డి ,నాగేశ్వరరావు యాదవ్ ,గుడిసె కృష్ణమ్మ ,గట్టు తిమ్మప్ప ,తుగ్గలి నాగేంద్ర , పి హనుమంతరావు చౌదరి,కమ్మూరు నాగరాజు మరియు ఉమ్మడి జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులు,కార్యకర్తలు,శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది..

### రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్

### ..ఎమ్మెల్సీ బిటి నాయుడు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్‌లో తెదేపా నేత బిటి నాయుడుకు రెండవ సారి ఎమ్మెల్సీ పదవి వచ్చిన సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముగ్గురూ కలిసిమెలిసి ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సైతం కలిసి పని చేయాలన్నారు. ఉమ్మడి కుటుంబంలో సమస్యలు ఉంటాయని.. కలిసి పరిష్కరించుకోవాలన్నారు. 2047 విజన్‌తో సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారన్నారు. సుదీర్ఘకాలం మన ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలోనే క్రమశిక్షణ కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. పార్టీలో ఎవరైనా ఇష్టానుసారం మాట్లాడితే సహించమని.. తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీలో కష్టపడిన వారందరికీ పదవులు వస్తాయని.. ఓపిక, సహనంతో ఉండాలని చెప్పారు.కర్నూల్లో బీసీ భవన్ కోసం అప్పటి టిడిపి ప్రభుత్వంలో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వంలో దాని నిర్మాణం జరగలేదన్నారు. ఇప్పుడు మళ్లీ తమ ప్రభుత్వంలో బీసీ భవన్ నిర్మాణం కోసం తాను కృషి చేస్తానని చెప్పారు. వివిధ హోదాల్లో ఉన్న నాయకులు కూడా ఇందు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు.

## పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుంది

### ..ఎం.పి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నప్పుడు బీ.టి నాయుడి ప్రోత్సాహం మరువలేనిది.

### ...బీ.టి నాయుడు సన్మాన కార్యక్రమంలో ఎం.పి బస్తిపాటి నాగరాజు



**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. రెండవ సారి ఎం.ఎల్.సీ గా ప్రమాణ స్వీకారం చేసిన బీ.టి నాయుడికి ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ని జిల్లా పరిష్యత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సన్మాన సభ లో రాష్ట్ర మంత్రి టీ.జి భరత్ తో కలిసి ఆయన పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు ఎం.ఎల్.సీ బీ.టీ నాయుడిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు... అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీలలో లేని విధంగా ఒక్క తెలుగుదేశం పార్టీలో నే నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు...తాను ఎం.పి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్న సమయంలో బీ.టి నాయుడు తనను ఎంతగానో ప్రోత్సాహించారన్నారు... కర్నూలు పార్లమెంట్ టిక్కెట్ కురువలకు ఇస్తున్నట్లు మొదట తనకు చెప్పింది బీ.టి నాయుడేనని తెలిపారు..పార్టీ అధికారంలో లేని సమయంలో జిల్లా అధ్యక్షుడిగా బీ.టి నాయుడు పార్టీని బలోపేతం చేశారన్నారు.. ఇక బీ.టి నాయుడు పార్టీకి చేసిన సేవలను గుర్తించి సీ.ఎం చంద్రబాబు ఎం.ఎల్.సీ గా రెండవ సారి అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందన్న ఎం.పి, రానున్న రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నతమైన పదవులను అధిరోహించాలని



ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎం.ఎల్.ఏ కె.ఈ శ్యామ్ కుమార్, ఆదోని ఎం.ఎల్.ఏ పార్థసారథి, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రి కె.ఈ ప్రభాకర్, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ లు,వివిధ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు.

### - చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.




**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.
సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## ఈనెల 14 వ తేదీ సోమవారం నిర్వహించే "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
14 వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి (ప్రభుత్వ సెలవు దినం) సందర్భంగా జిల్లాలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం రద్దు అయిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలతో జిల్లా కేంద్రానికి రావొద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ను సస్పెండ్ చేయాలి

**-యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు డిమాండ్**

**- పేద ప్రజల ఆరోగ్యాలతో వ్యాపారం చేస్తూ మోసం చేస్తూన్న వ్యక్తీ పై విజిలెన్స్,ఎసిబి దాడులు చేయ్యలి**

**- కమీషన్లకు హస్పటల్స్ తో కలసిపోయిన అవినీతి ఆరోగ్య శ్రీ కో- ఆర్డినేటర్ ను తొలగించాలి**

**- లేదంటే జిల్లా వ్యాపితంగా దశల వారిగ ఆందోళనలు నిర్వహిస్తాం**



**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్):** కర్నూలు ఆరోగ్యశ్రీ ను నిర్వీర్యం చేస్తున్న ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ను సస్పెండ్ చెయ్యాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. శనివారం కర్నూల్ లోని బిర్లా కాంపౌండ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... మాట్లాడుతూ..కర్నూల్ జిల్లాలో ఆరోగ్యశ్రీ సంబంధించిన హాస్పిటల్స్ నుండి బెడ్ స్ట్రింత్ నూ బట్టి మరియు ఆరోగ్యశ్రీ సక్రమంగా నడవడం లేదంటూ అవినీతికి పాల్పడుతున్నా ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ను సస్పెండ్ చేసిన తర్వాత ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రతి నెల ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ఇంటికి వెళ్లి హాస్పటల్ మేనేజ్మెంట్లు డబ్బులు ఇవ్వడం జరిగింది. అందుకు సంబంధించిన ఆధారాలు కూడా మేము మీకు అందజేస్తామని తెలియజేస్తున్నాం. అలాగే ఆరోగ్యశ్రీ సంబంధించిన పేషెంట్ దగ్గర ఆరోగ్యశ్రీ వైద్యం డబ్బులు కాక హాస్పిటల్ వారు డబ్బులు వసూలు చేస్తు ఆరోగ్యశ్రీని సరైన మార్గంలో అమలు చేయక పోతే కూడా వారికి మద్దతు పలికి కమిషన్ తీసుకొని నిర్వహణ చేసే విషయంలో విఫలమైనారు.కావున తక్షణమే ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ను తక్షణమే సస్పెండ్ చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కలిసి వచ్చేటువంటి విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## నేడు "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం "రద్దు

### -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్):** ఏప్రిల్ 14వ తేదీన (సోమవారం) భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా (ప్రభుత్వ సెలవు దినం) " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో జిల్లా ఎస్పీ "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక " కార్యక్రమానికి రావొద్దని తెలిపారు. జిల్లా ప్రజలు ( ఫిర్యాదుదారులు) ఈ విషయాన్ని గమనించగలరని జిల్లా ఎస్పీవిజ్ఞప్తి చేశారు.

## నేర ప్రవృత్తిని మానుకొని సమాజంలో

# మంచి పౌరులుగా జీవించాలి

**రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన నంద్యాల జిల్లా పోలీసులు**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవు అని హెచ్చరిక**





**నంద్యాల క్రైం, ఏప్రిల్ 13, (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలోని పోలీసు అధికారులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. జీవనోపాధికి వారు చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. నిరంతరం మీ కదలికలపై నిఘా ఉంటుందని పోలీస్ అధికారులు తెలియజేశారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తిని మానుకొని సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా పోలీస్ వారి సూచనలను బేఖాతరు చేసిన అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# టీటీడీ గోశాలపై అసత్య ప్రచారాలు చేయొద్దు

## రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్



**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడటం తగదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఆవుల మరణాలపై భూమన వ్యాఖ్యలను ఖండిస్తూ మంత్రి టి.జి భరత్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తితిదే పవిత్రతను కాపాడేందుకు ఎన్డీయే ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి అవాస్తవాలను ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయంలో, వ్యాధులతో నెలకు సగటున 10 ఆవుల వరకు మృత్యువాత పడుతుంటాయన్నారు. ఇది గత ఐదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టంగా తెలుస్తుందన్నారు. టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణను సక్రమంగా చూసుకుంటున్నారని పేర్కొన్నారు. కోటిమంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కుట్రలు చేయొద్దని వైసీపీ నేతలకు మంత్రి హితవు పలికారు.

# సండేస్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారం



కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)
మట్టల ఆదివారం ను కర్నూలు లో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కోల్స్ సెంటీరియల్ చర్చ్ లో చిన్నారులు మట్టలను ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. సీసీ చర్చ్ మరియు సండే స్కూల్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు హొసన్న, హొసన్న అంటూ నినాదాలు చేశారు. ఏసుక్రీస్తు జేరుషలేం లో జయప్రవేశం సందర్భంగా నేడు మట్టల ఆదివారం నిర్వహిస్తారని సుపరింటెండెంట్ దేవ మనోహర్ రాజు తెలిపారు. ఈకార్యక్రమంలో దేవ మనోహర్ రాజు,సుధీర్ జార్జ్, సామ్ సంగ్ పాల్, ఆర్. ప్రమోద్, పాస్టర్ జీ. రవి కుమార్, మధుకర్,మనోహర్, శ్వేతా, ఆర్. సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కరాటే జడ్జ్ ను సన్మానించిన టీజీ. వెంకటేష్




**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13 (రిపబ్లిక్ న్యూస్):** విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో పాల్గొంటే మంచి భవిష్యత్తు ఉంటుందని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ. వెంకటేష్ కర్నూలు లో అన్నారు. వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జ్ గా మొట్టమొదటిసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్నికైన కర్నూలు యువకుడు జగదీష్ కుమార్ ను టీజీ. వెంకటేష్ అభినందించి సన్మానించారు. ఈసందర్భంగా టీజీ. వెంకటేష్ మాట్లాడుతూ కరాటేను చిన్నారులు ఎక్కువగా నేర్చుకుంటున్నారని ఇది చాలా శుభపరిణామం అన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఏకాగ్రత పెరిగి చదువుల్లో రాణిస్తారని తెలిపారు. ప్రపంచ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కర్నూలు యువకులు విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. క్రీడలకు తనవంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని టీజీ. వెంకటేష్ తెలియజేశారు. తనకు అన్నివిధాల సహకరించిన టీజీ. వెంకటేష్ ను జగదీష్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో టీజీ. వెంకటేష్ తో పాటు కీర్తన్ కొండూరు, హరి కిషన్, మహబూబ్ బాష,గోపినాథ్,చంద్రశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం రద్దు




**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సెలవు కారణంగా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం నుండి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని, నగర ప్రజలు గమనించాలని కమిషనర్ పేర్కొన్నారు.

# కంచి యూనివర్సిటీలో ప్రవేశం కొరకు స్పాట్ అడ్మిషన్స్



**కర్నూల్లో ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
తమిళనాడు రాష్ట్రము కంచి లో శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం ( కంచి యూనివర్సిటీ ) వారి స్పాట్ అడ్మిషన్స్ కర్నూలు లోని శంకర మఠం లో నిర్వహించడం జరిగింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ శ్రీ గుళ్ళపల్లి శ్రీనివాస యూనివర్సిటీ యొక్క స్థితి గతులు అక్కడి వాతావరణం గురించి వివరించారు. కోర్సుల వివరాలు ఫి హాస్టల్ వసతి గురించి డీన్ వెంకటరమణ తెలియచేసారు.విజ్ఞానం తో పాటు విజ్ఞతను విద్యార్థులలో నింపేదే విద్య ముఖ్య ఉద్దేశం కావాలన్న మహాస్వామి ఆశీపూర్వక సంకల్పాన్ని నడిచేదైవం మహాస్వామి శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి శత జయంతి ఉత్సవ శుభ సందర్భాన శ్రీ శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి కృషి ఫలంగా ఆవిర్భవించిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ విశ్వ మహా విద్యాలయం కాంచీపుర పుణ్య క్షేత్రంలో 1993 నుంచి దిన దిన ప్రవర్ధమానమవుతూ 28 వ స్నాతకోత్సవం ఈ మధ్యనే దిగ్విజయంగా జరుపుకున్నది. కంచి కామకోటి పీఠ పరమాచార్య దివ్య ప్రణాళికను, ప్రస్తుత ఆచార్య దేవులు శ్రీ శ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి తన దివ్య సూచనలతో, భవ్యముగా అమలుచేయ బడుతోంది. గత 28 సంవత్సరాలుగా స్నాతకులందరూ తమ తమ భవిష్యత్తును దివ్యంగా మలచుకోవడంలోనే ఈ విశ్వవిద్యాలయ కృషి ఫలితం ద్యోతకం అవుతుంది. ఇంజనీరింగ్ లోని అన్ని విభాగాలు, శాస్త్ర సాంకేతిక, మేనేజ్మెంట్, వైద్య విజ్ఞాన శాస్త్రములే కాక,వైద్య అనుబంధ సేవా శాస్త్రములు (para medicals), Physio therapy, విద్యా శాస్త్ర (Education), న్యాయ శాస్త్ర (Law), ఇతర సాంఘిక సంస్కృతిక భాషా శాస్త్రములు మొదలగు శాస్త్రములను UG, PG మరియు పరిశోధనా స్థాయిలలో అందివ్వ బడుతోంది. బాల బాలికలకు విశ్వ విద్యాలయ ఆవరణలోని సువిశాల వసతి గృహములు రుచికరమైన, ఆరోగ్యకరమైన శుద్ధ శాకాహారంతో అందిస్తాయి. దాదాపు 50 ఎకరాల సువిశాల పచ్చని ప్రశాంత పరిసరాలతో, ప్రతీ విభాగానికి ప్రత్యేక భవనాలతో, అన్ని విభాగాలకూ సంబంధిత ప్రయోగ పరిశోధనా విభాగాలతో, PhD పొందిన ఆచార్యుల బోధనలో, 50000 చదరపు అడుగుల సువిశాల AC library% తో, WiFi సౌకర్యంతో, 24/7 CC కెమెరాల పర్యవేక్షణ రక్షణ లో విద్యార్థులు దిగ్విజయంగా తమ విద్యార్జనను ఆమోఘంగా పొందవచ్చని చాలా మంది ఔత్సాహికులకు తెలియదు. అనేక మేనేజ్మెంట్ క్లబ్బులు, incubator% సర్కిల్స్, startup testing క్లబ్బులు, విద్యార్థి వికాసానికి తోడ్పాటు సాంస్కృతిక క్లబ్బులు అందుబాటులో ఉన్నాయని కూడా చాలామందికి తెలియదు.అందు నిమిత్తమై విశ్వ విద్యాలయ అనేక ప్రదేశాలలో స్పాట్ కౌన్సిలింగ్ కార్యక్రమాలు చేపట్టింది. ప్రతిభావంతులకు అనేక ప్రోత్సాహక స్కాలర్షిప్ కూడా అందిస్తుంది. విశ్వవిద్యాలయం ఇచ్చే ప్రోత్సాహకాలతో పాటు కంచి కామకోటి పీఠ అంగములైన శాస్త్రసరణి మరియు సంప్రదాయ పాఠశాలలు తమ తమ వసతి గృహముల ద్వారా ఇతర ప్రోత్సాహక స్కాలర్షిప్ లు కూడా అందిస్తున్నాయి. ఈ సదవకాశాన్ని ఔత్సాహికులందరూ అంది పుచ్చుకొని లాభపడిమన భారతావనికి మంచి భవిష్యత్తును అందించడంలో నిష్ణాతులు కాగలరని ఆశిస్తున్నాము.ఈరోజు జరిగిన ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర నాయకులు హెచ్ కే రాజశేఖర రావు, కల్లె చంద్రశేఖర్ శర్మ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

# ప్రభుత్వ బడిని కాపాడుకోవాలి

## - అందుకు ఉపాధ్యాయులందరూ పోరాడాలి - యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు












**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13 (రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ బడిని కాపాడుకోవాలని, అందుకు ఉపాధ్యాయులందరూ పోరాడాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. యుటిఎఫ్ కర్నూలు జిల్లా ప్రారంభోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత సి.క్యాంప్ సెంటర్ నుంచి యుటిఎఫ్ భవన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ భవన్ వద్ద యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ అధ్యక్షతన విద్యా రంగ సవాళ్లు-కర్తవ్యాలపై సదస్సు నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ఇపి ప్రశ్నించేతత్వం లేకుండా చేస్తుందన్నారు. పాలకవర్గ ప్రయోజనాల కోసమే విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఉపాధ్యాయులంటే పాఠాలు చెప్పు వారుగా కాకుండా ఇతర పనులు చేసే మార్చేశారన్నారు. తాము అధికారంలోకి వస్తే జిఒ 117 రద్దు చేస్తామని పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, దాన్ని రద్దు చేయకుండా ప్రత్యామ్నాయం కోసం కసరత్తు చేస్తున్నారని తెలిపారు. 2018లో 38 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో ఉంటే ఈ ఏడాదికి ఆ సంఖ్య 32.61 లక్షలకు తగ్గిందన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య కూడా తగ్గిందన్నారు పాఠశాలలు, విద్యార్థులు లేకుండా ఉపాధ్యాయులు ఉండరని, పిల్లల హక్కుల మీద ఉపాధ్యాయుల హక్కులు ఆధారపడి ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ బడిని కాపాడుకుంటేనే నైతిక, రాజ్యాంగ విలువలు ఉంటాయన్నారు. ప్రపంచ బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా సాల్ట్, ఎన్ఇపి తీసుకొచ్చారని అన్నారు. సంస్కరణలు ప్రయివేటీకరణను పెంచుతాయని, అవి జరగకుండా కాపాడుకోవాలని తెలిపారు. సమాంతర మీడియాన్ని కొనసాగించాలని, ప్రతి పంచాయతీలో ఐదు తరగతులు, ఐదుగురు ఉపాధ్యాయులతో మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని, అందులో ఏ పాఠశాలనూ మ్యాప్ చేయకూడదని డిమాండ్ చేశారు. విద్యారంగ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా ఉండాలని, లేకుంటే తల్లిదండ్రులతో కలిసి ఉద్యమాలు చేపడతామని చెప్పారు. కుల, మతాలను ఇంటి దగ్గరే వదిలేసి బడిలోకి రావాలని, రాజ్యాంగ లక్ష్యాలను అమలు చేసే ప్రయత్నం చేయాలని కోరారు.

### ఆర్థిక ప్రయోజనాల కోసం పోరాడాలి..

**- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్**

పిఆర్సి, ఆర్థిక బకాయిల సాధన - కర్తవ్యాలపై యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో 20 శాతం మందికే అన్ని ప్రయోజనాలూ అందుతున్నాయన్నారు. 2022లో నష్టదాయకమైన రివర్స్ పిఆర్సి చేశారని, ఆశించిన ప్రయోజనాలు రాకుండా ప్రతి దానిలో కోత పెట్టారని చెప్పారు. ఆ అసంతృప్తితోనే ఆ పార్టీని ఓడిరచారన్నారు. బకాయిలు అన్ని ఇచ్చాకా పిఆర్సి వేస్తే బాగుంటుందని చెబుతున్నారని, అది పిఆర్సిని ముందుకు వాయిదా వేయడమేనని తెలిపారు. ఇప్పుడు పిఆర్సి కమిషన్ వేస్తే అది అందేందుకు కనీసం రెండేళ్లు పడుతుందన్నారు. వెంటనే 12వ పిఆర్సి కమిషనర్ను నియమించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానం కావాలంటే 29 శాతం ఫిట్మెంట్ కావాలని, అందు కోసం 29 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఆర్థిక ప్రయోజనాల కోసం పోరాడాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జయచంద్రారెడ్డి, లక్ష్మిరాజ, కర్నూలు జిల్లా అధ్యక్షులు యుఆర్ఎ రవి కుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, పూర్వ గౌరవాధ్యక్షులు నరసింహులు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎంవి రమణయ్య, సుబ్బారెడ్డి, పూర్వ సహాధ్యక్షులు నాగమణి, పూర్వ కార్యదర్శి కోటేశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్ పరిశీలన -ట్రాఫిక్ నియంత్రణ పై ప్రత్యేక దృష్టి







**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం డ్రోన్ కెమెరాలను వినియోగిస్తు న్నట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదివారం తెలిపారు.కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ ఆదేశాలతో కర్నూల్ పట్టణంలో పోలీసులు డ్రోన్ల తో నిఘా పటిష్టం చేశారు.ఈ రోజు సాయంత్రం కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ ట్రాఫిక్ ను పరిశీలించారు.
ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ...నిబంధనలు పాటించని వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు. ఓవర్ స్పీడ్, సెల్ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్లను గుర్తిస్తామన్నారు.ప్రధాన సర్కిళ్లతోపాటు ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంత్రాలలో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తామన్నారు.ప్రధాన రహదారులు, కూడళ్లు, వివిధ కాలనీల్లోని వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పై ప్రధాన దృష్టి సారిస్తున్నామన్నారు.
ట్రాఫిక్ జామ్ కాకుండా డ్రోన్ల ద్వారా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.
ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఇరుకు రోడ్లలలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో పరిశీలన చేసి సమీక్షించారు.



# బాధితుడికి బ్యాగు, బంగారం అప్పగింత

**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13(రిపబ్లిక్ న్యూస్):** ఆదివారం కర్నూలు కమాండ్ కంట్రోల్ పోలీసులు ఆటోలో పోగొట్టుకున్న బ్యాగ్, బంగారం ను వెతికించి బాధితుడికి అందించారు. ఆదివారం మధ్యాహ్నం నంద్యాల జిల్లా కొత్త పల్లె కి చెందిన శ్రీధర్ బ్యాంకు ఉద్యోగి. కర్నూలు నంద్యాల చెక్ పోస్టు దగ్గర ఉన్న మెగాసిరి ఫంక్షన్ హాల్ లో ఒక పెళ్ళికి హాజరయ్యారు. అనంతరం అతని కుటుంబం తో కలిసి కర్నూలు నంద్యాల చెక్ పోస్ట్ వద్ద ఆటో ఎక్కాడు. కర్నూలు సుంకేశుల రోడ్డులో ఉన్న కార్తీక హాస్పిటల్ నందు దిగారు. బ్యాగు లో ఒక జత బంగారు కమ్మలు సుమారు (75,000 విలువ గల 10 గ్రాముల బంగారం ) ఉండినవి.అనంతరం హాస్పిటల్ కు వెళ్ళి చూసుకోగా బ్యాగు ను ఆటోలో మర్చిపోయినట్లు బాధితుడు కమాండ్ కంట్రోల్ పోలీసులకు తెలిపాడు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఇటీవలకొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సిఐ శివశంకర్ ఆధ్వర్యంలో ఎఎస్సైలు సుబ్బరాజు , అస్లాం , కానిస్టేబుళ్ళు లక్ష్మణ్, జిలాని లు సీసీ కెమెరాల ద్వారా ఆటో ని ట్రేస్ ఔట్ చేశారు.ఆటో డ్రైవర్ ని పిలిపించి బాధితునికి వారి సొమ్మును తిరిగి అప్పగించారు.



# జయంతి ఉత్సవాలకు సిద్ధమైన అంబేడ్కర్ విగ్రహం

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో మొట్ట మొదటిసారిగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను గ్రామస్తుల సహకారంతో నిర్వహించటానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు, అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఆరెల్లి మహేష్ స్వయంగా అంబేడ్కర్ విగ్రహానికి గ్రామ తాజా మాజీ సర్పంచ్ దుర్గం లక్ష్మి తిరుపతి ల సహకారంతో రంగులు దిద్ది ఉత్సవాలకు విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేశాడు. నేడు అంబారిపేట గ్రామంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసినట్లు కమిటీ చైర్మన్ దర్శనాల నరేష్, గౌరవ అధ్యక్షుడు ఆరెల్లి మహేష్ లు పేర్కొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా బీపీ మండల్ వర్ధంతి వేడుకలు



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, (రిపబ్లిక్ న్యూస్) ఏప్రిల్ 13:** పెద్దపల్లి జిల్లాల్లో బిందేశ్వర్ ప్రసాద్ మండల్ వర్ధంతి వేడుకలు పలు బిసి కుల సంఘాలు,యువజన సంఘాలు ఘన0గా నిర్వహించుకున్నారు పలువురు నాయకులు బిపి మండల్ గారు బిసి ల కోసం పోరాడి సాధించిన బిసి కమిషన్ గురించి మాట్లాడారు బిపి మండల్ గారి ఆధ్వర్యంలో మరో ఐదుగురు సభ్యులతో ఒక కమిషన్ వేయడం జరిగింది ఇది ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాలకు మరియు విద్యకు దూరంగా ఉన్న కులాల గురించి సర్వే చేయమని వేయడం జరిగింది ఇది తన నివేదికను 1979లో సెంట్రల్ గవర్నమెంట్ కి సమర్పించడం జరిగింది దీని ద్వారానే 1992లో ఓ బిసి రిజర్వేషన్ రావడం జరిగింది, బీసీల గురించి బీహార్ ముఖ్యమంత్రి పదవిని కూడా వదులుకున్న మహానుభావుడు అని పలువురు కొనియాడారు స్వతంత్రం వచ్చిన తర్వాత నుండి 1992 వరకు కూడా బీసీల గురించి ఎవరూ పట్టించుకోలేదు ఇప్పటికీ కూడా చాలా మందికి తెలియని విషయం ఇది భారతదేశంలో ఉన్న 52 శాతం ప్రజలకు మేలు కలిగించిన వ్యక్తి బిందేశ్వరి ప్రసాద్ మండల్ గారు, అలాంటి మహానుభావుని నేడు వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులు అర్పించారు ధర్మారం లో దామోదర్ యాదవ్ ఎన్నారై కెనడా గారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మారం మండల అంబేద్కర్ చౌరస్తాలోని బిసి ఎస్సి కుల సంఘ నాయకులతోని బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు దొంగతుర్తి లొ బిసి అజది యూత్ ఆధ్వర్యంలో ఆయా మండలంలో జరిగిన కార్యక్రమల లో పోచబోయిన శ్రీ హరి యాదవ్ మేకల మల్లేశం మారం తిరుపతి యాదవ్ ఎలుక రాజు యాదవ్ బత్తిని లక్ష్మణ్ కాడే సూర్యనారాయణ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వేల్పుల నాగరాజు,గౌడ సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు మూల మల్లేశం గౌడ్,ఆవుల శ్రీనువాస్,బిసి ఆజాద్ ఫెడరేషన్ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులు ముధం శ్రావణ్ కుమార్,ఐరిపెల్లి శ్రీనివాస్ నాయి బ్రాహ్మణ మండల అధ్యక్షులు, తమ్ముడవేని అంజి, ఆవుల కుమారస్వామి,కొమ్ము లచ్చయ్య, సంకరి నర్సింగం,మల్లేశమ్, సిరికొండ రవి, దాసరి స్వామి, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ మరియు బిసి ఎస్సీ నాయకులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఏఎంసీ చైర్మన్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట శ్రీరామ రైస్ మిల్ యజమాని వంగల తిరుమల్ రెడ్డి సోదరుడు వంగల శివశంకర్ రెడ్డి - రమ్యశ్రీ నూతన దంపతుల వివాహ వేడుకలు పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా, వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక -జితేందర్ రెడ్డి వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, నాయకులు గెల్లు శ్రీనివాస్, మన్నె జితేందర్, గాజుల విజయ్, సింగతి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తండ్రీ కొడుకులను, పవన్ కల్యాణ్ ను నమ్ముకుంటే పోలీసులకు ఇదే గతి పడుతుంది: పేర్ని నాని

**ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)**



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారంలో గుంటూరులో 11 మంది పోలీసుల సస్పెన్షన్ పై వైసీపీ నేత పేర్ని నాని తీవ్ర స్థాయిలో స్పందించారు. మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తండ్రీ కొడుకులను, పవన్ కల్యాణ్ ను నమ్ముకుంటే పోలీసులకు ఏ గతి పడుతుందో కళ్లెదుటే కనిపిస్తోందని అన్నారు. హుందాతనం మరచి రెడ్ బుక్ రచయిత లోకేశ్ ను చూసుకుని, అడ్రస్ లేని పవన్ కల్యాణ్ ను చూసుకుని రెచ్చిపోతే తిప్పలు తప్పవని పోలీసులను హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అధికారులను వాడుకుని వదిలేయడం సాధారణమని, ఈ విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్పైలు, సీఐలు గమనించాలని సూచించారు. చంద్రబాబు ఎవరినైనా ఎర వేస్తారని, బలి చేస్తారని పేర్ని నాని తీవ్రంగా విమర్శించారు. అధికారి, బంధువు, పోలీసు, కార్యకర్త ఎవరైనా చంద్రబాబుకు ఒకటేనని అన్నారు. కేవలం కార్యకర్తలను మెప్పించడానికి 11 మంది పోలీసులకు శిక్ష విధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రెడ్ బుక్ చూసో, లోకేశ్ మాటలు వినో, చంద్రబాబు ఆదేశాలనో పాటించి కొందరు పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. దొంగ కేసులు పెట్టడం, కొట్టడం, తిట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని, కాబట్టి అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

# ధర్మపురి నియోజకవర్గంలో పిఎస్ఆర్ విస్తృత పర్యటన

## - పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు - బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



దారి సమస్య పై గ్రామస్తులతో చర్చిస్తున్న పిఎస్ఆర్



పీఎస్ఆర్ ను శాలువాతో సత్కరిస్తున్న చెన్నకేశవ స్వామి



ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న పీఎస్ ఆర్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం లోని ఎండపల్లి, ధర్మారం మండలాల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పొనుగోటి శ్రీనివాసరావు (పీఎస్ఆర్ బాపు) ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఆయా మండలాల్లోని పలు ఆలయాల్లో జరిగిన ప్రత్యేక ఉత్సవాల్లో పీఎస్ఆర్ పాల్గొనగా, ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో సాదరంగా ఘన స్వాగతం పలికారు. ఎండపల్లి మండలం లోని ముంజంపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, గొడిశెలపేట గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మారం మండలం లోని గోపాల్ రావుపేట ఆలయంలో ధ్వజ స్థంభం పునఃప్రతిష్టాపన, కటికెనపల్లి దుర్గామాత ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు ఆలయ నిర్వాహకులు పిఎస్ఆర్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

అనంతరం స్థానిక బిజెపి నాయకులు మల్లెత్తుల భూమయ్య, అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు ఆహ్వానం మేరకు కొత్తపేటలోని వారి జిన్నింగ్ మిల్లుకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రాజకీయాల స్థితిగతుల గురించి చర్చించుకున్నారు.

### -బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ఎండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెండు కుటుంబా లను పిఎస్ఆర్ పరమా ర్శించి,ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బిఆర్ఎస్ నాయకుడు నిమ్మ రాము కుటుంబానికి రూ.10 వేలు, మేకల సంతోష్ కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. అనంతరం పాతగూడూర్ గ్రామంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న పోచమ్మ గుడి కి వెళ్ళే రహదారి గురించి గ్రామస్థులతో కలిసి చర్చించారు. గ్రామస్తుల కోరిక మేరకు తాను స్థలాన్ని గుడికి విరాళంగా అందజేస్తానని పీఎస్ఆర్ హామీ ఇవ్వగా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేసి, జేజేలు పలికారు. ఈకార్యక్రమం లో జగిత్యాల జిల్లా రారైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు నూనె శ్రీనివాస్, నాయకులు రావు సుగ్రీవరావు, గెల్లు చంద్రశేఖర్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, చుక్క శంకర్ రావు, గొడిసెలపేట ఆలయ కమిటీ చైర్మన్ సబ్బు కేశవ్, పందిళ్ళ రాజేందర్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కంది విష్ణు, లక్కాకుల శ్రీనివాస్, దేవి అఖిల్ , మహేష్, జలంధర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించండి

## ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించండి

### ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.

### ఆసుపత్రికి అవసరమైన పరికరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వండి: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





**నంద్యాల ప్రతినిధి, ఏప్రిల్ 13, రిపబ్లిక్ న్యూస్ :-**






ప్రతిరోజు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు దాదాపు 1500 రోగులు వస్తుంటారని వచ్చే రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఆదివారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు సి.శ్రీదేవి, శ్రీరామమూర్తి, శివశంకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఏ. శ్రీదేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు దాదాపు 1500 రోగులు వస్తుంటారని వచ్చే రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు ఉండడంతో పాటు డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, త్రాగునీటి వసతి, మౌలిక సదుపాయాల మరమ్మతులను హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ నిధుల నుండి వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పటినుండి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి అవసరమైన పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించి అవసరమైన నిధులు సమకూర్చుకొని అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి జిజిహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు.

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డాక్టర్లు అందరూ కూడా అందుబాటులో ఉండి పేదవారి పట్ల మానవతా దృక్పథంతో మంచి వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రికి ఒక గుర్తింపు తీసుకురావాలన్నారు. ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొంటూ కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. రహదారి ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు ఇతర అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి అందించేందుకు క్రిటికల్ కేర్ యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని మంత్రి ఆదేశించారు. గతంలో పెండింగ్ ఉన్న ఎలక్ట్రికల్, ప్లంబరింగ్ స్టేషనరీ, సిసి కెమెరా తదితర బిల్లులకు సంబంధించిన నిధులను ఆమోదించామన్నారు. ఆసుపత్రికి అవసరమైన తాగునీటి సౌకర్యాన్ని అమృత స్కీం కింద ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను మంత్రి ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పేద ప్రజలు వైద్యం కోసం ఎంతో నమ్మకంతో వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న వసతులను మరింత పటిష్టం చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. హాస్పటల్లో పారిశుధ్య లోపం, టాయిలెట్ల నిర్వహణ లేకపోవడం, త్రాగునీటి సమస్య, పరికారాలు లేకపోవడం, పరికరాలు ఉంటే టెక్నీషియన్స్ లేకపోవడం తదితర లోపాలు ఉన్నట్లు హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారని ... వీటన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో సమకూర్చాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. సిఎస్ఆర్ నిధులతో ఆర్వో ప్లాంట్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయిస్తామని ప్రొసీజర్ ప్రకారం ఎస్టిమేట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి దస్త్రాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీ, డయాలసిస్, ఎక్స్ రే ఎక్విప్మెంట్, బ్లడ్ బ్యాంకులో రిఫ్రిజిరేటర్లు, 24 గంటల ల్యాబ్, బయో కెమిస్ట్రీ కి సంబంధించిన డిస్టిల్ వాటర్, తదితర రోగులకు అవసరమైన వైద్య పరికరాలను హాస్పిటల్ డెవలప్మెంట్ నిధుల నుండి వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్పిటల్ కు అన్ని విధాల సపోర్టు ఇచ్చి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో నీటి కొరత లేకుండా మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

# తిరుపతి 'తొక్కిసలాట'వెనుక భూమన కుట్రకోణం!

## గోవుల మృతిలో టీటీడీ సిబ్బంది నిర్లక్ష్యం లేదు - భూమనపై చట్టపరమైన చర్యలు: టీటీడీ చైర్మన్

తిరుపతి(టీటీడీ), **ఏప్రిల్ 13( రిపబ్లిక్ న్యూస్)**

రుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు ముఖ్య కారకుడు గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి అని, దీని వెనుక కుట్ర కోణం ఉండొచ్చని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతిలోని ఎస్వీ గోశాలను ఆయన ఆదివారం సందర్శించి, గోవులను పరిశీలించారు. అక్కడి అధికారులతో సమీక్షించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. గతంలో హిందూ వ్యతిరేక వ్యక్తి టీటీడీ చైర్మన్ కావడం మనందరి దురదృష్టమని అన్నారు. 'ఆయన హిందువు కాదు. కుమార్తెకు ఏ సంప్రదాయం ప్రకారం వివాహం చేశారో అందరికీ తెలుసు. అలాంటి వ్యక్తి ఈరోజు టీటీడీ గురించి విమర్శలు చేస్తున్నారు. రాజకీయంగా పోరాటం చేయాలి కానీ టీటీడీపై ఆరోపణలు చేయడమేంటి? టీటీడీ ఇంజనీరింగ్ విభా గం ద్వారా రూ.1,600 కోట్లు ఇచ్చి కమీషన్లు తీసుకున్నారు. గడువు ముగిసిన మందులు, పురుగులు పట్టిన దాణా ఇచ్చిన వ్యక్తి గోవుల గురించి మాట్లాడుతున్నారు. కొన్ని సహజంగా, మరికొన్ని అనారోగ్యంతో, వృద్ధాప్యంతో చనిపోవడం సాధారణం. ఇందులో టీటీడీ నిర్లక్ష్యం ఏమీ లేదు. ఇలాంటి వ్యక్తి భూమి పై పుట్టకూడదని స్వామివారిని కోరుకుంటున్నా. హిందూ మతంపై పడటం కాదు. వేరే మతస్తులపై పడితే తెలుస్తుంది. కరుణాకర్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎక్కడో చనిపోయిన గోవులను ఇక్కడివే అన్నట్లు చూపిస్తున్నారు' అని విమర్శించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం ధార్మిక క్షేత్రాన్ని ధనార్జన క్షేత్రంగా మార్చిందని టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. భగవంతుడిపై నమ్మకం, విశ్వాసం లేని వ్యక్తిని టీటీడీ ఛైర్మన్‌గా నియమించారని మండిపడ్డారు. తిరుపతి రోడ్లు, టీటీడీ గోవిందరాజ సత్రాల కమీషన్లతో తన కుమారుడి ఎన్నికల ఖర్చు పెట్టుకున్న వ్యక్తి.. 3నెలల్లో వంద గోవులు చనిపోయాయని ఆరోపించడం ఏమిటని ప్రశ్నించారు. తిరుమలకు, ఒంటిమిట్టలో కల్యాణానికి సతీసమేతంగా మీ నాయకుడిని తీసుకొచ్చే ప్రయత్నం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పురుగులు పట్టిన దాణాను ఆవులకు పెట్టకూడదని 2024 ఏప్రిల్ 1న విజిలెన్స్ నివేదికలో ఉంటే అప్పడెలా పెట్టారంటూ వీడియోలు విడుదల చేశారు. అసత్య ప్రచారంలో ఎవరెవరు ఉన్నారో వారి కాల్ డేటా ఆధారంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గొల్ల నరసింహయాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మహేశ్ యాదవ్ తదితరులు టీటీడీ ఛైర్మన్‌ను కోరారు.

# ముంబై విజయం



## ఢిల్లీ జోరుకు బ్రేక్

## 12 రన్స్ తేడాతో ముంబై విజయం

## కరుణ్ నాయర్ పోరాటం వృథా



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ వరుస విజయాల జోరుకు బ్రేక్ పడింది. ఆఖర్లో అనూహ్య తడబాటుతో గెలుపు ముంగిట బోల్తా పడింది. మూడేళ్ల తర్వాత ఐపీఎల్ ఆడిన కరుణ్ నాయర్ (40 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్సర్లతో 89) అద్భుత ఆటతీరుతో జట్టును విజయం ఖాయమనే స్థితికి చేర్చాడు. అయితే 19వ ఓవర్‌లో అశుతోష్ (17) సహా ముగ్గురు రనౌట్‌గా వెనుదిరగడంతో డీసీ మూల్యం చెల్లించుకుంది. దీంతో మరో ఓవర్ ఉండగానే ముంబై 12 పరుగుల తేడాతో రెండో విజయాన్నందుకుంది. అటు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఢిల్లీకిదే తొలి ఓటమి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. తిలక్ (33 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 59), రికెల్టన్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 41), సూర్యకుమార్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 40), నమన్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) రాణించారు. కుల్దీప్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. పోరెల్ (33) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్లు కర్ణ్‌కు మూడు, శాంట్నర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కర్ణ్ శర్మ నిలిచాడు.

కరుణ్ పోరాడినా..: భారీ ఛేదనలో ఢిల్లీ మొదటి బంతికే ఓపెనర్ మెక్‌గుర్క్ (0) వికెట్‌ను కోల్పోయింది. కానీ మరో వికెట్ కోసం పది ఓవర్ల వరకు వేచి చూడాల్సి వచ్చింది. ఇందుకు ఇంపాక్ట్ ప్లేయర్ కరుణ్ నాయర్ ఆటతీరే కారణం. నాయర్-పోరెల్ కలిసి రెండో వికెట్‌కు ఢిల్లీ 119 పరుగుల భారీ భాగస్వామ్యం లభించింది. దేశవాళీల్లో అదరగొట్టిన కరుణ్ ఇక్కడా అదే ఫామ్‌ను కనబర్చాడు. ఈ జోడీ ప్రమాదకరంగా మారిన వేళ 11వ ఓవర్‌లో పోరెల్‌ను స్పిన్నర్ కర్ణ్ శర్మ అవుట్ చేశాడు. ఇక్కడి నుంచి ఢిల్లీ ఒక్కసారిగా తడబడింది. తర్వాతి ఓవర్‌లోనే కరుణ్‌ను శాంట్నర్ బౌల్డ్ చేయగా.. కర్ణ్ వరుస ఓవర్లలో స్టబ్స్



(1), రాహుల్ (15)లను అవుట్ చేసి షాకిచ్చాడు. ఇక అక్షర్ (9), విప్రజ్ (14) వైఫల్యంతో చివర్లో అశుతోష్ జోరు పెంచాడు. 12 బంతుల్లో 23 రన్స్ కావాల్సిన వేళ 19వ ఓవర్‌లో అతడు రెండు ఫోర్లు బాది ఉత్కంఠ పెంచాడు. కానీ రెండో పరుగు కోసం వెళ్లిన అశు తోషతో పాటు వరుస బంతుల్లో కుల్దీప్ (1), మోహిత్ (0) కూడా రనౌట్ కావడంతో ముంబై సంబరాలు చేసుకుంది.

కలిసికట్టుగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్‌లో ఓపెనర్ రికెల్టన్, సూర్యకుమార్‌తో పాటు మిడిలార్డర్‌లో తిలక్ వర్మ జట్టుకు అండగా నిలిచారు. అతడికి డెత్ ఓవర్లలో నమన్ ధిర్ అద్భుత సహకారం అందించాడు. ఐదో ఓవర్‌లో విప్రజ్ ఎల్బీతో వెనుదిరగ్గా తొలి వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే కుల్దీప్ గూగ్లీకి రికెల్టన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత సూర్య-తిలక్ జోడీ డీసీ బౌలర్లను ఆడేసుకుంది. 13వ ఓవర్‌లో సూర్య 6,4 తిలక్ 4తో 17 రన్స్ సమకూరాయి. ఇక ఆఖరి ఓవర్‌లో తిలక్ స్లాగ్ స్వీప్ షాట్‌ను ప్రయత్నించగా..బౌండరీ లైన్‌కు అత్యంత సమీపంలో పోరెల్ సూపర్ క్యాచ్ తీసుకోవడంతో ఐదో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఈ ఓవర్‌లో నమన్ రెండు ఫోర్లతో 11 రన్స్ రాగా 200 దాటింది.

### స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (ఎల్బీ) విప్రజ్ 18బీ రికెల్టన్ (బి) కుల్దీప్ 41బీ సూర్యకుమార్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 40బీ తిలక్ (సి) పోరెల్ (బి) ముకేశ్ 59బీ హార్దిక్ (సి) స్టబ్స్ (బి) విప్రజ్ 2బీ నమన్ (నాటౌట్) 38బీ జాక్స్ (నాటౌట్) 1బీ ఎక్స్‌ట్రాలు: 6బీ మొత్తం: 20 ఓవర్లలో 205/5. వికెట్ల పతనం: 1-47, 2-75, 3-135, 4-138, 5-200బీ బౌలింగ్: స్టార్క్ 3-0-43-0బీ ముకేశ్ 4-0-38-1బీ విప్రజ్ 4-0-41-2బీ కుల్దీప్ 4-0-23-2బీ అక్షర్ 2-0-19-0బీ మోహిత్ 3-0-40-0.

ఢిల్లీ: మెక్‌గుర్క్ (సి) జాక్స్ (బి) చాహర్ 0బీ పోరెల్ (సి) నమన్ (బి) కర్ణ్ 33బీ కరుణ్ (బి) శాంట్నర్ 89బీ రాహుల్ (సి అండ్ బి) కర్ణ్ 15బీ అక్షర్ (సి) సూర్య (బి) బుమ్రా 9బీ స్టబ్స్ (సి) నమన్ (బి) కర్ణ్ 1బీ అశుతోష్ (రనౌట్) 17బీ విప్రజ్ (స్టంప్) రికెల్టన్ (బి) శాంట్నర్ 14బీ స్టార్క్ (నాటౌట్) 1బీ కుల్దీప్ (రనౌట్) 1బీ మోహిత్ (రనౌట్) 0బీ ఎక్స్‌ట్రాలు: 13బీ మొత్తం: 19 ఓవర్లలో 193 ఆలౌట్. వికెట్ల పతనం: 1-0, 2-119, 3-135, 4-144, 5-145, 6-160, 7-180, 8-192, 9-193, 10-193. బౌలింగ్: చాహర్ 3-0-24-1బీ బౌల్ట్ 2-0-21-0బీ బుమ్రా 4-0-44-1బీ శాంట్నర్ 4-0-43-2బీ హార్దిక్ 2-0-21-0బీ కర్ణ్ 4-0-36-3.

# రాజస్థాన్ చిత్తు

## బెంగళూరు ఘన విజయం

## 9 వికెట్లతో రాజస్థాన్ చిత్తు జైస్వాల్ అర్ధ శతకం



జైపూర్: ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 65), కోహ్లీ (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62 నాటౌట్) అర్ధ శతకాలతో చెలరేగడంతో.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఘన విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (75), ధ్రువ్ జురెల్ (35 నాటౌట్), రియాన్ పరాగ్ (30) రాణించారు. క్రునాల్, భువనేశ్వర్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 17.3 ఓవర్లలో 175/1 స్కోరు చేసి గెలిచింది. దేవ్‌దత్ పడిక్కల్ (40 నాటౌట్) దూకుడుగా ఆడాడు. సాల్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఆరంభం నుంచే బాదుడు..: రాజస్థాన్ బ్యాటర్లు తడబడిన పిచ్‌పై ఓపెనర్ సాల్ట్ భారీ షాట్లతో విరుచుకుపడడంతో మ్యాచ్ ఏకపక్షమైంది. మరో ఓపెనర్ కోహ్లీతో కలిసి సాల్ట్ తొలి వికెట్‌కు 52 బంతుల్లో 92 పరుగులు జోడించడంతో.. బెంగళూరు అలవోకగా గెలిచింది. బౌండ్రీతో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సాల్ట్‌ను కార్తికేయ అవుట్ చేశాడు. అనంతరం వన్‌డౌన్‌లో వచ్చిన పడిక్కల్‌తో కలిసి కోహ్లీ రెండో వికెట్‌కు అజేయంగా 83 పరుగులు జోడించడంతో.. బెంగళూరు మరో 15 బంతులు మిగిలుండగానే గెలుపుగీత దాటింది. ఈ క్రమంలో హసరంగ బౌలింగ్‌లో సిక్స్ బాదిన కోహ్లీ.. టీ20ల్లో తన వందో అర్ధ శతకాన్ని నమోదు చేశాడు.

%శాంసన్ విఫలం..: ఓపెనర్ జైస్వాల్ అర్ధ శతకంతో ఆకట్టుకోగా.. జురెల్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో రాజస్థాన్ గౌరవప్రద స్కోరు చేసింది. ఆరు ఓవర్లు ముగిసే సరికి రాజస్థాన్ 45/0తో నిలిచింది. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో క్రునాల్ బౌలింగ్‌లో శాంసన్ స్టంపౌట్ కావడంతో.. తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన పరాగ్.. జైస్వాల్‌కు చక్కని సహకారం అందించాడు. ఈ క్రమంలో 13వ ఓవర్‌లో సింగిల్‌తో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ తర్వాతి ఓవర్‌లో పరాగ్‌ను యశ్ అవుట్ చేసి దెబ్బకొట్టాడు. ఇక, హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో జైస్వాల్ ఎల్బీగా వెనుదిరిగాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ క్యాచ్‌వదిలేయడంతో బతికిపోయిన జురెల్..తర్వాత ధాటిగా ఆడడంతో స్కోరు 170 మార్క్ దాటింది.

కోహ్లీకి లైఫ్..: 7 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సందీప్ బౌలింగ్‌లో కోహ్లీ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను పరాగ్ నేలపాలు చేశాడు. లాంగ్ ఆన్ నుంచి వచ్చిన పరాగ్.. నిర్లక్ష్యంగా క్యాచ్‌ను అందుకోవడంతో అది చేజారింది.

క్యాచ్ చేజార్చిన విరాట్..: ఫీల్డింగ్‌లో కోహ్లీ ఎంతో చురుగ్గా ఉంటాడనేది తెలిసిందే. అలాంటి విరాట్ చేతిలో పడ్డ బంతి కిందపడిపోవడంతో.. ఫ్యాన్స్ మండిపడుతున్నారు. 17వ ఓవర్‌లో జురెల్ కొట్టిన బంతిని బౌండ్రీ వద్ద నుంచి ముందుకు వచ్చిన కోహ్లీ పట్టినట్టేపట్టి వదిలేశాడు. దీంతో అభిమానులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు.



### స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 75, శాంసన్ (స్టంప్డ్) జితేష్ (బి) క్రునాల్ 15, పరాగ్ (సి) కోహ్లీ (బి) యశ్ 30, జురెల్ (నాటౌట్) 35, హెట్‌మయర్ (సి) పడిక్కల్ (బి) భువీ 9, రాణా (నాటౌట్) 4బీ ఎక్స్‌ట్రాలు: 5బీ మొత్తం: 20 ఓవర్లలో 173/4బీ వికెట్ల పతనం: 1-49, 2-105, 3-126, 4-169బీ బౌలింగ్: భువనేశ్వర్ 4-0-32-1, యశ్ దయాళ్ 4-0-36-1, హాజెల్‌వుడ్ 3-0-26-1, క్రునాల్ పాండ్యా 4-0-29-1, లివింగ్‌స్టోన్ 1-0-8-0, సుయాష్ శర్మ 4-0-39-0.

బెంగళూరు: సాల్ట్ (సి) జైస్వాల్ (బి) కార్తికేయ 65, కోహ్లీ (నాటౌట్) 62, పడిక్కల్ (నాటౌట్) 40బీ ఎక్స్‌ట్రాలు: 8బీ మొత్తం: 17.3 ఓవర్లలో 175/1బీ వికెట్ల పతనం: 1-92బీ బౌలింగ్: ఆర్చర్ 4-0-36-0, తుషార్ దేశ్‌పాండే 2-0-21-0, సందీప్ 2.3-0-29-0, తీక్షణ 2-0-21-0, కుమార్ కార్తికేయ 3-0-25-1, హసరంగ 3-0-33-0, పరాగ్ 1-0-10-0



# ధీరజ్ టీమ్‌కు రజతం

## ఫైనల్లో చైనా చేతిలో ఓటమి

న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో ధీరజ్ బొమ్మదేవర నేతృత్వంలోని భారత పురుషుల రికర్వ్ జట్టు రజతంతో సరిపెట్టుకొంది. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో ఆదివారం జరిగిన ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్‌లతో కూడిన భారత్ 1-5 పాయింట్ల తేడాతో చైనా టీమ్ చేతిలో పరాజయం పాలైంది. తొలి సెట్ 54-54 పాయింట్లతో సమమైంది. అయితే, రెండో సెట్‌ను 58-55తో చైనా నెగ్గడంతో.. మ్యాచ్‌లో నిలవాలంటే మూడో సెట్‌లో భారత్ తప్పనిసరిగా నెగ్గాల్సిన పరిస్థితి. కానీ, భారత్ 54-55తో ఓడడంతో చైనాకు స్వర్ణం ఖాయమైంది. కాంస్య పతకాన్ని కూడా చైనానే సొంతం చేసుకొంది.

## లూకాస్ మార్టెన్స్ ప్రపంచ రికార్డు



ఒలింపిక్ చాంపియన్ స్విమ్మర్ లూకాస్ మార్టెన్స్ (జర్మనీ) పురుషుల 400 మీ. ఫ్రీస్టయిల్‌లో వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. స్విస్ ఓపెన్‌లో భాగంగా శనివారం జరిగిన ఈ విభాగంలో 3:39.96 సెకన్ల టైమింగ్‌తో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో 2009లో సహచర జర్మన్ స్విమ్మర్ పాల్ బీడర్‌మన్ నెలకొల్పిన రికార్డును 0.11 సెకన్ల తేడాతో అధిగమించాడు. 23 ఏళ్ల మార్టెన్స్ పారిస్ ఒలింపిక్స్‌లోనూ 400మీ. ఫ్రీస్టయిల్‌లో స్వర్ణం అందుకున్నాడు.



# ఐపీఎల్‌లో రోబో డాగ్

ఐపీఎల్ ప్రత్యక్ష ప్రసారంలో సరికొత్త అనుభూతిని అందించేందుకు బీసీసీఐ కృత్రిమ మేధను అందిపుచ్చుకొంది. ఈ మేరకు రోబో డాగ్‌ను ప్రవేశపెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. బ్రాడ్‌కాస్టింగ్ టీమ్‌లో చేరిన రోబో డాగ్‌ను ప్రముఖ కామెంటేటర్ డానీ మారిసన్ పరిచయం చేశాడు. ముంబై, ఢిల్లీ జట్లు సాధన చేస్తున్న సమయంలో ఆటగాళ్లను కొత్త అతిథి పలకరించింది. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యాకు షేక్ హ్యాండ్ ఇచ్చింది. మారిసన్ వాయిస్ కమాండ్‌లకు తగ్గట్టుగా ఫీట్లు చేసి అలరించింది.

# అక్కతో మంచు మనోజ్.. వెరీ ఎమోషనల్..



ఈమధ్య కాలంలో మంచు వారి ఫ్యామిలీలో పలు వివాదాలు హాట్ టాపిక్ గా మారుతున్న విషయం తెలిసిందే. మంచు మనోజ్ సోదరుడిపై అలాగే తండ్రి విషయంలో పలు రకాల కామెంట్స్ చేయడం అందరికి ఆశ్చర్యం కలిగించింది. ఈ క్రమంలో మంచు లక్ష్మి ఫ్యామిలీ గొడవలకు దూరంగానే ఉంది. ఇక ఆమె ఎవరికి మద్దతు ఇస్తున్నారు అనే విషయంలో అనేక రకాల కథనాలు వచ్చాయి. ఇక లేటెస్ట్ గా ఒక వీడియో వైరల్ గా మారింది.

ఓ ఈవెంట్ వేదిక.. వెలుగులతో మెరిసిపోయే స్టేజ్, వెనుక నుంచి మెల్లిగా అక్కను ఆప్యాయంగా పట్టుకున్నాడు మనోజ్.. అంతలో మంచు లక్ష్మి ఎవరా.. అని వెనక్కి తిరిగి చూసింది. ఇక తమ్ముడిని అలా చూడగానే మంచు లక్ష్మి కంటతడి పెట్టి, అతడిని బలంగా హత్తుకుంటున్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ ఫోటోల్లో కనిపిస్తున్న మూడో వ్యక్తి మాత్రం ఎవరో కాదు.. భూమా మౌనిక. ఈ వీడియోలో కనిపించిన భావోద్వేగాలు అభిమానుల గుండెను హత్తుకుంటున్నాయి. ఇటీవలే మౌనిక తన పెళ్లిరోజు సందర్భంగా సోషల్ మీడియాలో పెట్టిన ఎమోషనల్ పోస్ట్ కు మంచు లక్ష్మి చేసిన కామెంట్ కు కూడా మంచి స్పందన వచ్చింది. అదే సమయంలో ఈవెంట్ లో లక్ష్మి మోకాలిపై కూర్చుని కంటతడి పెట్టిన దృశ్యం ఒక గొప్ప కుటుంబ ప్రేమకు అద్దం పడుతోంది. ఇదే సమయంలో మంచు మనోజ్ తన సోదరికి తన మద్దతు తెలుపుతూ ఆమెను బలంగా హత్తుకుని, ప్రేమగా అభినందించడం చూసినవారంతా 'ఇది కదా ఫ్యామిలీ ఎమోషన్' అని కామెంట్ చేస్తున్నారు. ఇటీవల మనోజ్-లక్ష్మి మధ్య స్నేహబంధం దూరమైంది అన్న వార్తలు వచ్చిన నేపథ్యంలో ఇది హార్ట్ఫుల్స్ వీడియోగా మారింది. ఇక మరోవైపు మనోజ్ సినిమాలతో బిజీ అవుతున్న విషయం తెలిసిందే. భైరవం సినిమాలో ఒక పవర్ఫుల్ క్యారెక్టర్ చేస్తున్నారు. ఇక మరోవైపు తేజ సజ్జ హీరోగా చేస్తున్న మిరాయ్ సినిమాలో విలన్ గా నటిస్తున్నారు. ఈ రెండు సినిమాలతో మనోజ్ మళ్ళీ బౌన్స్ బ్యాక్ అయ్యేలా కెరీర్ ను సెట్ చేసుకుంటున్నాడు. మరి ఈ సినిమాలు అతనికి ఎలాంటి క్రేజ్ ని తీసుకు వస్తాయో చూడాలి.

# ఆ లోటు విజయశాంతి తీర్చారు: ఎన్టీఆర్

**హైదరాబాదులో అర్జున్ సన్నాఫ్ వైజయంతి ప్రీ రిలీజ్ వేడుక**
**ముఖ్య అతిథిగా ఎన్టీఆర్**
**ఎన్టీఆర్ ప్రసంగానికి అభిమానుల నుంచి విశేష స్పందన**




కళ్యాణ్ రామ్ చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన అనేక విషయాలు పంచుకున్నారు. గతంలో 'దేవర' సినిమా కార్యక్రమం అభిమానుల తాకిడి కారణంగా రద్దు అయింది. ఆ తరువాత చాలా కాలానికి మళ్ళీ సోదరుడు కళ్యాణ్ రామ్ కోసం ఆయన ఒక వేడుకకు హాజరయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ వేడుకలో ఎన్టీఆర్ మాట్లాడుతూ, అన్నయ్య కళ్యాణ్ రామ్ సినిమా వేడుకకు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అంతేకాకుండా విజయశాంతి ప్రసంగం వింటుంటే తండ్రి లోటు తీరినట్టు అనిపించిందని ఆయన పేర్కొన్నారు.

ఆగస్టు 14న తాను నటించిన 'వార్ 2' చిత్రం విడుదల కానుందని ఎన్టీఆర్ స్పష్టం చేశారు. అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ, మళ్ళీ ఎప్పుడు కనబడతానో తెలియదు కాబట్టి, ఈ వేడుకలో తన మనసులోని మాటలను పంచుకోవాలని ఉందని అన్నారు.

"అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా కథ 'కర్తవ్యం' సినిమా స్ఫూర్తితో రూపొందిందని భావిస్తున్నాను. కర్తవ్యం సినిమాలో వైజయంతి ఐపీఎస్ పాత్రలో నటించారు, ఆ పాత్రకు కొడుకు ఉంటే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఈ సినిమా రూపొందింది. ఇలాంటి ఆలోచన రావడం చాలా సంతోషంగా ఉంది. నేను సినిమా చూశాను. విజయశాంతి గారు, పృథ్వీ గారు లేకపోతే ఈ సినిమా లేదు. నిర్మాతలు, దర్శకులు ఎంతో కష్టపడి ఈ సినిమాను రూపొందించారు" అని అన్నారు.

"ఏప్రిల్ 18న సినిమా విడుదల అవుతుంది. రాసి పెట్టుకోండి, చివరి 20 నిమిషాలు థియేటర్లో ప్రేక్షకులు కన్నీళ్లు పెట్టుకుంటారు. అంత అద్భుతంగా ఈ సినిమాను మలిచారు. కళ్యాణ్ రామ్ కాలర్ ఎగరవేయడానికి సంకోచిస్తుంటే, నేనే ఎగరవేస్తాను" అంటూ ఎన్టీఆర్ సరదాగా అన్నారు.

సినిమా చూస్తున్నప్పుడు తన కన్నీళ్లు ఆగలేదని, ప్రేక్షకులు కూడా అదే అనుభూతి పొందుతారని ఎన్టీఆర్ అన్నారు. క్లైమాక్స్ సన్నివేశం అంత బాగా రావడానికి కళ్యాణ్ రామ్ కారణమని, ఆయన ఈ సినిమా ఆలోచనను నమ్మి, ఎంతో డెడికేషన్‌తో నటించడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. కళ్యాణ్ రామ్ ఎన్నో గొప్ప సినిమాలు చేసినప్పటికీ, ఇది ఆయన కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా నిలుస్తుందని ఎన్టీఆర్ కొనియాడారు. కళ్యాణ్ రామ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశారని, విజయశాంతి తల్లి పాత్రలో నమ్మి నటించారని, అందుకే సినిమా ఇంత బాగా వచ్చిందని ఆయన అన్నారు.



# 5 నిమిషాలకు కోటి రూపాయలు తీసుకున్న తమన్నా!

మిల్కీ బ్యూటీ తమన్నా సక్సెస్ ఫుల్ గా తన కెరీర్ ను కొనసాగిస్తోంది. ముఖ్యంగా స్పెషల్ సాంగ్స్ లో మెరుస్తోంది. స్వతహాగా మంచి డ్యాన్సర్ అయిన తమన్నాకు... ఐటెం సాంగ్స్ లో వరుస ఆఫర్లు వస్తున్నాయి. తమ సినిమాలో తమన్నా సాంగ్ ఉంటే హిట్ అయినట్టేనని నిర్మాతలు, దర్శకులు భావిస్తున్నారు. బాలీవుడ్ లో అజయ్ దేవగన్, వాణి కపూర్ జంటగా తెరకెక్కిన 'రైడ్ 2' చిత్రంలో తమన్నా మరోసారి మెరిసింది. 'నషా' అనే స్పెషల్ సాంగ్ తో అలరించింది. నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సాంగ్ 24 గంటల్లోనే 12 మిలియన్ వ్యూస్ సాధించి యూట్యూబ్ లో టాప్ ట్రెండింగ్ లో ఉంది. ఈ పాట కోసం తమన్నా ఎంత రెమ్యునరేషన్ తీసుకుందనేది బాలీవుడ్ సర్కిల్స్ లో హాట్ టాపిక్ గా మారింది. 5 నిమిషాల ఈ పాట కోసం ఏకంగా రూ. 1 కోటి తీసుకుందని సమాచారం. కేవలం 5 నిమిషాల స్క్రీన్ ప్రెజెన్స్ కోసం తమన్నా ఈ రేంజ్ లో తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# ప్రణీత మరోసారి మెస్మరైజ్..!



కన్నడ బ్యూటీ ప్రణీత సుభాష్ ఈ మధ్య కాలంలో సినిమాల్లో ఎక్కువగా కనిపించడం లేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్‌గా కనిపిస్తూ కన్నుల విందు చేస్తోంది. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ప్రణీత సుభాష్ సొంతం. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటినా కూడా అందం ఏమాత్రం తగ్గలేదు అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు వీడియోలు ఇప్పటికీ వైరల్ అవుతున్నాయి. ఈమె అందం చూస్తే ప్రస్తుతం ఉన్న స్టార్ హీరోయిన్స్ కంటే ఎంతో బెటర్ అనే అభిప్రాయంను నెటిజన్స్ వ్యక్తం చేస్తున్నారు. %పెళ్లి పిల్లల తర్వాత సాధారణంగా సౌత్ హీరోయిన్స్ సినిమాలకు కాస్త దూరం అవుతారు, గ్లామర్ వరల్డ్‌కి సైతం దూరంగా ఉండాలి అనుకుంటారు. కానీ ప్రణీత సుభాష్ మాత్రం పెళ్లికి ముందు ఎలా అయితే ఉందో ఇప్పుడు అదే విధంగా చాలా బిజీగా సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేస్తూ ఉంది. అందంగా ఉన్న ప్రణీత సుభాష్ ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతున్నాయి. తాజాగా మరోసారి ఈమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. లాంగ్ ఫ్రాక్ బ్లాక్ అండ్ వైట్ ఔట్‌ఫిట్‌తో ప్రణీత సుభాష్ చూడముచ్చటగా ఉంది. స్కిన్ షో చేయకున్నా ప్రణీత షేర్ చేసిన ఈ ఫోటోలను నెటిజన్స్ తెగ లైక్ చేస్తూ కామెంట్స్ చేశారు.

# యువ హీరోతో అనుపమ పరమేశ్వరన్ డేటింగ్?



ప్రేమమ్ సహా పలు బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించిన అనుపమ పరమేశ్వరన్ కి తెలుగు ప్రేక్షకులలో భారీ ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ భామ ఇటీవల కోలీవుడ్ లోను వరుస చిత్రాలలో నటిస్తోంది. ఇలాంటి సమయంలో అనుపమ తన కోస్టార్ ధృవ్ విక్రమ్‌తో డేటింగ్ ప్రారంభించిందంటూ ప్రచారం ఊపందుకుంది. ఈ జంట ఘాఢంగా ముద్దు పెట్టుకుంటున్న ఫోటో ఒకటి తాజాగా ఆన్‌లైన్‌లో లీక్ అయింది. ఈ ఫోటో చూడగానే, నెటిజనులు షాక్ కి గురయ్యారు. ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారా? అని ఆశ్చర్యపోయారు. మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ స్పాటిఫైలో అనుపమ - ధ్రువ్ మధ్య షేర్డ్ ప్లే జాబితాను నెటిజనులు గుర్తించిన తర్వాత ఈ ఫోటో లీక్ అయింది. కానీ ప్లేజాబితాలోని పాటలు నెటిజన్లను ఆకర్షించలేదు. దానికి బదులుగా ప్లేజాబితా ఫోటో అభిమానులను రెప్ప వేయకుండా చూసేలా చేసింది. స్పోటిఫై ప్లేజాబితాలో ఎడ్ షీరన్, ర్యాన్ గోస్లింగ్, జస్టిన్ హర్విట్జ్ సహా పలు హిట్ పాటలు ఉన్నాయి. ఈ ఫోటో వైరల్ కావడంతో, నెటిజనులు రకరకాలుగా ఊహిస్తున్నారు. నిజానికి ఈ జోడీ %-%బైసన్%-% అనే తమిళ చిత్రంలో కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాకి ఆశించిన బజ్ లేదు. దీంతో బజ్ తెచ్చేందుకు ఇలా పబ్లిసిటీకి దిగారని అనుమానిస్తున్నారు. అందుకే చాలా మంది ఇది పబ్లిసిటీ స్టంటా? అని ప్రశ్నించారు. ఇందులో అనుపమ - ధ్రువ్ స్క్రీన్ ని షేర్ చేసుకుంటున్నారు. లేదా ఇద్దరూ నిజంగా ఒకరిలో ఒకరు ప్రేమను కనుగొన్నారా? అని కొందరు నెటిజనులు ప్రశ్నిస్తున్నారు. కొందరు అభిమానులు నిజంగా అందంగా కనిపించే జంట అని పొగిడేసారు. ఈ జోడీ ఇంకా డేటింగ్ పుకార్లపైనా, లీక్ అయిన ఫోటోపైనా స్పందించలేదు.

# సవాళ్లు ఎదుర్కొంటున్న క్రేజీ సీక్వెల్

అప్పటికే బ్లాక్ బస్టర్లతో రక్తి కట్టించిన ఫ్రాంఛైజీలో కొత్త సీక్వెల్ రూపొందించడం అంటే నిజంగా దర్శకుడికి కత్తి మీద సాము లాంటిదే. మునుపటి టింజ్ ని తిరిగి తెరపైకి తీసుకు రాకపోతే ఫ్రాంఛైజీ ఫ్యాన్స్ నుంచి చాలా విమర్శల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా కామెడీ యాక్షన్ ఎంటర్ టైనర్లకు కథకు కొనసాగింపు తో పాటు, పాత్రలు పాత్రధారుల్లో సింక్ చాలా ముఖ్యం. దాంతో పాటు, ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదు! అనేంత కొత్తదనం సీక్వెల్ కథలో చూపించాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ టీజర్ లో కనిపించనందున %-%వెల్ కం%-% ఫ్రాంఛైజీలో మూడో భాగంపై చాలా క్రిటిసిజం ఎదురవుతోంది. అక్షయ్ కుమార్, సునీల్ శెట్టి, పరేష్ రావల్ సహా 20 మందికి పైగా దిగ్గజ నటీనటులతో కొత్త పార్ట్ తెరకెక్కించాలని అహ్మద్ ఖాన్- ఫర్హాద్ సామ్జీ పెద్ద ప్లాన్ వేసినా అది వర్కవుట్ కావడం లేదు. %-%వెల్‌కం- 3%-%కి సంబంధించి సరైన అప్ డేట్ లేకపోవడంతో తీవ్ర అనిశ్చితి వెంటాడుతోంది. ఈ సినిమా ఖాన్ - సామ్జీల పనితనానికి అగ్ని పరీక్షగా మారనుంది.

చాలా గ్యాప్ రావడంతో పాటు అనీల్ కపూర్, నానా పటేకర్ లాంటి స్టార్లు లేకపోవడంతో జనం దీనికి కనెక్ట్ కావడం అంత సులువేమీ కాదు. అయినా చిత్రబృందం ప్రయత్నం ఆపలేదు. ప్రస్తుతం కాశ్మీర్ లో షూటింగ్ జరుగుతోంది. అంతర్జాతీయ విడుదల షెడ్యూల్ లాక్ అయింది. అయితే ఫ్రాంఛైజీలో




మునుపటి టింజ్ ని ఈ కొత్త సినిమా తేగలుగుతుందా? పాత్రధారులు కామెడీని అద్భుతంగా తెరపై ఆవిష్కరిస్తారా లేదా? ఫర్హాద్ సామ్జీ కథాంశంతో మ్యాజిక్ చేసాడా లేదా? అనే సందేహాలు అభిమానుల్లో ఉన్నాయి. సీక్వెల్ కి ఎదురయ్యే అన్ని ఛాలెంజ్ లను అధిగమించి దర్శకరచయితలు సరైన సినిమాని అందిస్తారే అంతా ఆశిస్తున్నారు.



# అంబేద్కర్ యుగపురుషుడు

## కుటుంబ నేపథ్యం జననం:



భీంరావ్ రాంజీ అంబేద్కర్ 1891 సంవత్సరం ఏప్రిల్ 14 నాడు అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన 'మౌ' అన్న ఊరిలో (ఇప్పటి మధ్యప్రదేశ్ లో) రాంజీ మలోజీ సాక్పాల్, భీమాబాయ్ దంపతుల 14వ చివరి సంతానంగా జన్మించాడు.ఇతని అసలు పేరు భీమారావు రంజీ అంబావడేకర్. అతని కుటుంబం ఆధునిక మహారాష్ట్ర లోని రత్నగిరి జిల్లాలో అంటవాడ గ్రామము నివాసులు కావున మరాఠీ నేపథ్యం కలవారు. వీరి వంశీకులు మహార్ కులానికి చెందినవారు ఇతని తండ్రి బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సుబేదారు గా పనిచేసాడు.ఆరేళ్ళ వయసులోనే అశ్రద్ధ, అవగాహన లేకపోవడం, ఆర్థిక కష్టాల కారణంగా తల్లి చనిపోయింది. మొత్తం 13 మంది తోబుట్టువులలో తొమ్మిది మంది అకాల మృత్యువాత పడగా ఇద్దరు అక్కలు – మంజుల, తులసి, ఇద్దరు అన్నలు– బలరాం, ఆనందరావు మిగిలారు.బాల్యములో అంబేద్కర్ సమస్య సవరించు మెహర్లను అస్పృశ్యులుగా పరిగణించడం వలన అంబేద్కర్ చిన్నతం లోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్నాడు. అతను వేరే పిల్లలతో కలవకుండా, మాట్లాడకుండా పాఠశాల గదిలో ఒక మూల కూర్చోబెట్టేవారు.మిగతా కులం వాళ్ళకి భిన్నంగా అస్పృశ్యులు నీళ్ళు తాగాలంటే ప్యూన్ వచ్చి ఇచ్చేవాడు. అతను లేకపోతే పిల్లలు నీళ్ళు తాగే అవకాశం వుండేది కాదు. ఈ దుస్థితిని అంబేద్కర్ క్లుప్తంగా – "ప్యూన్ లేదు కనుక నీళ్ళు లేవు" అని వివరించాడు.డబ్బులు చెల్లించే స్థోమత వున్నా సేవలు అందిచేవాళ్ళు ముందుకు రాకపోవడం వలన (మంగలి మహర్లని, చాకలి వీరి బట్టలనూ ముట్టుకునేవారు కాదు) అతని సోదరులే ఇంట్లో బట్టలు ఉతకడం, జుట్టు కత్తిరించుకోవడం చేసుకునేవారు. అంబేద్కర్ తొమ్మిది సంవత్సరాల వయసులో మాసూర్ నుండి గోరేగావ్ కి ప్రయాణం చేయదానికి ఎడ్లబండి వాళ్ళు ఎవ్వరూ (అస్పృశ్యులని) ముందుకురాకపోతే, మసూర్ స్టేషన్ మాస్టర్ సహాయంతో బండివాడికి రెండింతలు కిరాయి ఇచ్చి బండివాడు వెనుక నడువగా అంబేద్కర్ సోదరులే సొంతగా బండి నడుపుకుని వెళ్లారు

## రాజ్యంగ పరిషత్తు సభ్యుడిగా- మంత్రివర్గ సభ్యుడిగా అంబేద్కర్

రాజ్యాంగ పరిషత్తు సభ్యుడిగా అంబేద్కర్ విశేష శ్రమవహించి రాజ్యాంగం రచించటం ఆయన శేష జీవితంలో ప్రముఖమైన ఘట్టం. టి.టి కృష్ణమాచారి (కేంద్రమంత్రి) ఒకమారు రాజ్యాంగ పరిషత్తులో మాట్లాడుతూ 'రాజ్యాంగ రచనా సంఘంలో నియమితులైన ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొకరు మరణించారు. వేరొకరు అమెరికాలో ఉండిపోయారు. ఇంకొకరు రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులయ్యారు. ఉన్న ఒక్కరిద్దరు ఢిల్లీకి దూరంగా ఉన్నారు. అందువల్ల భారత రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. రాజ్యాంగ రచన అత్యంత ప్రామాణికంగా ఉంటుందనటంలో ఏలాంటి సందేహం లేదు' అన్నాడు. కేంద్ర మంత్రి మండలిలో న్యాయశాఖ మంత్రిగా వుండి 1951 అక్టోబరులో మంత్రి పదవికి రాజీనామా చేశాడు



**డా. బాబాసాహెబ్ అంబేద్కర్. ఒక ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశాడు. స్వాతంత్ర్య భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి. కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి., లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి (డాక్టరేట్) పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించాడు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశాడు. మొదట్లో న్యాయవాదిగా, అధ్యాపకుడిగా, ఆర్థికవేత్తగా పని చేశాడు. తరువాత భారతదేశ స్వాతంత్ర్యం, పత్రికల ప్రచురణ, దళితుల సామాజిక రాజకీయ హక్కులు, భారతదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం కృషి చేశాడు. 1956 లో ఇతను బౌద్ధ మతాన్ని స్వీకరించడంతో దళితులు సామూహికంగా బౌద్ధంలోకి మత మార్పిడి చేసుకున్నారు.1990 లో భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ను ఇతనికి మరణాంతరం ప్రకటించింది. భారతదేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన నాయకుడు.ఇతను చేసిన విశేష కృషికి ఇతని పుట్టినరోజును "అంబేద్కర్ జయంతి" గా జరుపుకుంటారు. 2012లో ది హిస్టరీ ఛానల్, రిలయన్స్ మొబైల్ భాగస్వామ్యంతో అవుట్ లుక్ మ్యాగజైన్ నిర్వహించిన ది గ్రేటెస్ట్ ఇండియన్ పోల్ లో అతను మొదటి స్థానంలో ఎంపికైయ్యాడు.**

## బౌద్ధమును స్వీకరించుట

అంబేద్కర్ తన 56 ఏట సారస్వత బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కుమారి శారదా కబీర్ ను పెళ్ళి చేసుకున్నాడు. మొదటి భార్య 1935లో మరణించింది. 1956 అక్టోబరు 14న నాగపూర్‌లో అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించాడు. గాంధీతో అనేక విషయాలలో విభేదించినా తాను మతం మారదలచుకున్నప్పుడు మాత్రం దేశానికి చాలా తక్కువ ప్రమాదకరం అయినదానినే ఎన్నుకుంటానని, బౌద్ధం భారతీయ సంస్కృతిలో భాగమని, ఈ దేశ చరిత్ర సంస్కృతులు, తన మార్పిడివల్ల దెబ్బతినకుండా చూచానన్నాడు. హిందువుగా పుట్టిన అంబేద్కర్ హిందువుగా మరణించలేదు. నిరంతర కృషితో సాగిన ఆయన జీవితం ఉద్యమాలకు ఊపిరి పోసింది. ముఖ్యంగా సాంఘిక సంస్కరణలకు. అంబేద్కర్ పెక్కు గ్రంథాలు వ్రాశాడు. 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ', 'ప్రొవిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా', 'ది బుద్దా అండ్ కార్ల్ మార్క్స్', 'ది బుద్ధా అండ్ హిజ్ ధర్మ' ప్రధానమైనవి. ప్రసిద్ధ రచయిత బెవెర్లి నికొలస్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశపు ఆరుగురు మేధావులలో ఒకరు అని ప్రశంసించాడు. మహామేధావిగా, సంఘసంస్కర్తగా, న్యాయశాస్త్రవేత్తగా, కీర్తిగాంచిన డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ 1956 డిసెంబరు 6 న మహాపరి నిర్వాణం చెందాడు. భారత రాజ్యాంగ శిల్పిగా, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా, సంఘసంస్కర్తగా, మహామేధావిగా విఖ్యాతుడైన డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ స్మృతికి నివాళులర్పిస్తూ, ఆ మహనీయునికి ' భారతరత్న ' అవార్డును భారత ప్రభుత్వం ఇవ్వడం అత్యంత అభినందనీయం.

### విద్యాభ్యాసం-ఉద్యోగం-కుల వివక్ష:

బరోడా మహారాజు శాయాజీరావ్ గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో బి.ఏ. పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. పట్టభద్రుడైన వెంటనే బరోడా సంస్థానంలో ఉద్యోగం లభించింది. కాని పైచదువులు చదవాలన్న పట్టుదల వల్ల ఉద్యోగంలో చేరలేదు. మహారాజుకు తన కోరికను తెలిపాడు. విదేశంలో చదువు పూర్తిచేసిన తరువాత బరోడా సంస్థానంలో పదేళ్ళు పనిచేసే షరతుపై 1913లో రాజాగారి ఆర్థిక సహాయం అందుకొని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరాడు. 1915లో ఎం.ఏ., 1916లో పి.హెచ్.డి. పట్టాలను పొందాడు. ఆనాటి సిద్ధాంత వ్యాసమే పదేళ్ళ తర్వాత "ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్సస్ ఇన్ ఇండియ" అనే పేరుతో ప్రచురితమయ్యింది. 1917లో డాక్టర్ అంబేద్కర్?గా స్వదేశం వచ్చాడు. అప్పటికి అతని వయస్సు 27 ఏళ్ళు. ఒక దళితుడు అంత గొప్ప పేరు సంపాదించుకోవటం ఆనాటి అగ్రవర్ణాలవారికి ఆశ్చర్యం కల్గించింది.మహారాజా శాయాజీరావ్ సంస్థానంలో సైనిక కార్యదర్శి అయ్యాడు. కాని కార్యాలయములో నౌకర్లు కాగితాలు అతని బల్లపై ఎత్తివేసేవారు. కొల్హాపూర్ మహారాజు సాహూ మహరాజ్ అస్పృశ్యతా నివారణకెంతో కృషి చేస్తుండేవాడు. మహారాజా సహాయంతో అంబేద్కర్ 'మూక నాయక్' అనే పక్షపత్రికకు సంపాదకత్వం వహించాడు. సాహు మహారాజు ఆర్థిక సహాయం చేసి అంబేద్కర్‌ని పైచదువుల కొఱకు విదేశాలకు పంపించాడు. 32 సంవత్సరాల వయసులో డా.అంబేద్కర్, బార్–అట్–లా, కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి., లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి పట్టాలను పొందాడు. కానీ కార్యాలయములో జనులు కూడా అతనిని అస్పృశ్యుడుగా చూచారు.



### యుగపురుషుడు..!!

ఆ మహా జ్యోతి ఎన్నో,కుటుంబాలకు వెలుగును నింపే నిత్య అగ్నిహెూత్ర మై సమాజముపై చూపు ప్రసరించె.సామాన్యుడి తలరాతను తరతరాల బానిసత్వం నుంచి ,బంగారు భవిత ప్రయాణానికి విజ్ఞాన సారధిగా ముందుండి నడిపించే ప్రపంచ మేధావుల్లో మొదటి వరసలో నిలిచి ప్రపంచ దేశాలు తిరిగి జ్ఞాన సముద్రాన్ని ఒడిసిపట్టే.అతనినుదుటి భాగం చూస్తే వేల గ్రంధాలు సారము
అతని మస్తిష్కంలో నిక్షిప్తం మై విశ్వనరుడై జ్ఞాన భిక్ష పెట్టె బుద్ధుని బోధనలకు ఆకర్షితులై, శాంతి మార్గాన్నికే నిదర్శనమై అభినవ బుద్ధుడిగా కీర్తి గాంచి దేశమంతా ప్రజల కోసం నడయాడే.అతను నడిచే గ్రంథాలయం ప్రపంచ విజ్ఞాన సర్వస్వం దీన బాంధవులకు ఆశాదీపంమై భారత రాజ్యాంగం నిర్మించే.యుగానికి ఒక పురుషుడు ప్రతి యుగంలోనూ ఉద్యమిస్తే దేశ భవిష్యత్తు ఎలా ఉంటుందో తానే ముందుండి అక్షరాలా నిరూపించెను.

కొప్పుల ప్రసాద్.
తెలుగు ఉపన్యాసకులు,
నంద్యాల.
9885066235



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmail.com